# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 184 | విశాఖపట్నం | 5-4-2026 ఆదివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణారావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 184 | VISAKHAPATNAM | 5-4-2026 SUNDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-



SBI

PATHAKAM NEWS

SCAN & PAY

UPI ID: 44576280686@sbi

BHIM | UPI | yono SBI | BHIM SBI Pay | G Pay | Paytm | Pay



Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram


# జన్మదిన శుభాకాంక్షలు






శ్రీ **మారిశెట్టి భాస్కరరావు** గారు
అవినీతిపై పోరాటం,
లోక్‌పాల్ ప్రజా గర్జన పెట్టి,
ప్రజలు ప్రభువులే నినాదాన్ని ఇచ్చి అతి చిన్న వయసులో
రాజకీయాల్లో ఓనమాలు నేర్చుకొని,
సిద్ధాంతాలకు కట్టుబడి,
ఎంతో మంది ఆప్యాయులకు ఆశ్రయం ఇచ్చి,
ధర్మం కోసం, దేశం కోసం నిలబడి,
బాబు జగజీవన్‌రాయి
జన్మదినం రోజునే ఊపిరి పోసుకొని
ధర్మాన్ని కాపాడటమే లక్ష్యంగా
ముందుకు వెళ్తున్న భారతీయ జనతా పార్టీ నాయకుడిగా,
ఉద్యమ నేతగా, యువకుడిగా
ధర్మాన్ని రక్షించే వీరుడుగా ఉన్న
మా అన్న శ్రీ **మారిశెట్టి భాస్కరరావు** గారికి
హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ..

శ్రీ **మారిశెట్టి భాస్కరరావు** గారు
భారతీయ జనతా పార్టీ అనకాపల్లి కార్పొరేట్
80 డివిజన్ ఇన్‌చార్జ్,
విబిజి రాంజీ అనకాపల్లి జిల్లా కో కన్వీనర్
శ్రీ సంతోషిమాత అమ్మవారి దేవస్థానం చైర్మన్

## ఇట్లు: అనకాపల్లి జిల్లా భారతీయ జనతా పార్టీ

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## వేటు..

విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సిఆర్‌ఎ)కు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన తాజా సవరణలతో స్వచ్ఛంద సంస్థలకు, కొన్ని మైనార్టీ మతాల వారు నిర్వహించే కార్యకలాపాలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కులు ప్రశ్నార్థకం కానున్నాయి. ఈ ప్రతిపాదనలకు దేశ వ్యాప్తంగా వ్యక్తమవుతున్న తీవ్ర వ్యతిరేకతను నరేంద్రమోడీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకుండా లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టడం దారుణం. విదేశీ నిధులను ఉపయోగించి దేశంలో మత మార్పిడులు జరుపుతున్నారంటూ ఎన్నాళ్లగానో ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న ఆరోపణల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఈ సవరణ బిల్లు ప్రజాస్వామ్య, లౌకిక విలువలను తుంగలో తొక్కుతోంది. విదేశీ విరాళాలు స్వీకరించే సంస్థలు నిర్ణీత గడువులో తమ లైసెన్స్‌ను పునరుద్ధరించుకోకపోతే, లేదా ఏ కారణంతోనైనా రద్దు అయిన లైసెన్స్‌ను నిర్దిష్ట కాలంలో తిరిగి పొందలేకపోతే, ఆ సంస్థల ఆస్తులు ఆటోమేటిక్‌గా ప్రభుత్వానికి లేదా, ప్రభుత్వ సంస్థకు బదిలీ అవుతాయంటూ చేర్చిన నిబంధన అత్యంత దుర్మార్గం! ఈ నిబంధన ద్వారా స్వచ్ఛంద సంస్థల సామూహిక భవనాలు, మైనారిటీలకు చెందిన ఏ ఆస్తినైనా, చివరకు అది ప్రార్ధనా స్థలం అయినా స్వాధీనం చేసుకునే అధికారం ప్రభుత్వానికి దఖలు పడుతుంది. ఇలా స్వాధీనం చేసుకున్న ఆస్తులు శాశ్వతంగా ప్రభుత్వానికే దక్కేలా నిబంధనలు రూపొందించారు. లైసెన్స్ పునరుద్ధరణ అధికారం పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికే ఉండడంతో, సాంకేతిక కారణాలు చూపించి లైసెన్స్ నిరాకరించే అవకాశం ఉందని, తద్వారా ఆస్తులను సులభంగా స్వాధీనం చేసుకుంటుందంటూ వ్యక్తమవుతున్న భయాలను ఏమాత్రం కొట్టివేయలేము. నిర్దిష్ట కాలంలో లైసెన్స్ పునరుద్ధరించకపోతే విదేశీ విరాళాలు స్వీకరించే అనుమతి దానంతటదే రద్దు అవుతుందని కూడా బిల్లులో పేర్కొన్నారు. దీని ద్వారా ఎప్పుడైనా, ఏ సంస్థకైనా విదేశీ విరాళాల అనుమతిని రద్దు చేసే అవకాశం కూడా ప్రభుత్వానికి లభిస్తుంది. ఇది ఆ సంస్థల ఊపిరి తీసేయడం మినహా మరొకటి కాదు. స్వచ్ఛంద సంస్థలకు విదేశీ విరాళాలను నియంత్రిస్తూ ఎమర్జెన్సీ సమయంలో ఇందిరా గాంధీ ప్రభుత్వం తొలుత ఈ చట్టాన్ని తీసుకు వచ్చింది. 2020లో మరిన్ని కఠిన నిబంధనలను చేర్చారు. తాజా సవరణల ద్వారా స్వచ్ఛంద సేవా రంగాన్ని పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుండటం అత్యంత ప్రమాదకరం! మన రాష్ట్రంలో అనంతపురం కేంద్రంగా పనిచేసే రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డిటి) ఉదంతమే దీనికి ఒక స్పష్టమైన ఉదాహరణ. వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో దశాబ్దాలుగా పేదరికం, విద్య, వైద్య రంగాల్లో నిరుపమానమైన సేవలు అందిస్తున్న ఆర్‌డిటి లైసెన్స్‌ను కేంద్ర ప్రభుత్వం సాంకేతిక కారణాలతో నిలిపివేసిన సంగతి తెలిసిందే. దీంతో కులమతాలకు, పార్టీలకు అతీతంగా ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి పోస్ట్‌కార్డుల ద్వారా తమ గోడును వెళ్లబోసుకున్నారు. చివరకు ప్రజా ఒత్తిడికి తలొగ్గి ఆ సంస్థ లైసెన్స్‌ను కేంద్రం పునరుద్ధరించాల్సి వచ్చింది. నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ వ్యాప్తంగా 21,700 సంస్థలు ఇలా లైసెన్స్ కోల్పోయాయన్నది అనధికార సమాచారం. దీనిపై రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్ అడిగిన ప్రశ్నకు పార్లమెంట్‌లో సమాధానం ఇవ్వడానికి కేంద్ర హోంమంత్రిత్వశాఖ నిరాకరించడం గమనార్హం. అదే సమయంలో ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థలకు కొత్తగా పెద్ద ఎత్తున లైసెన్స్‌లు దక్కుతుండటంతో మైనారిటీలపై వివక్ష చూపడమే ఈ సవరణల ప్రధాన లక్ష్యమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దేశ భద్రత, పారదర్శకత పేరిట ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వల్ల మైనారిటీలలో, స్వచ్ఛంద సంస్థలలో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలోనే సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌లు ప్రధానికి వేర్వేరుగా రాసిన లేఖల్లో ప్రతిపాదిత సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త వ్యతిరేకతను పరిగణనలోకి తీసుకోకుండా, ఏకపక్షంగా ఇటువంటి వివాదాస్పద బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదింపజేయాలని చూడటం రాజ్యాంగ విలువలకే గొడ్డలి పెట్టు. సేవా సంస్థల గొంతు నొక్కడం మానేసి, ప్రజాస్వామ్య స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలి.

## జగన్‌పై మంత్రి జనార్దన్ రెడ్డి ఫైర్



**అమరావతి, పతాకం న్యూస్:** వైసీపీ అధ్యక్షుడు జగన్ 2024 ఎన్నికల్లో ఓటమి పాలైనా ఆయనలో సైకో లక్షణాలు ఇంకా పోలేదని, రాష్ట్రాభివృద్ధికి అడ్డంకిగా మారి నిత్యం విషం చిమ్ముతున్నారని ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచమంతా అమరావతిని ఏకైక రాజధానిగా స్వాగతిస్తుంటే, పార్లమెంట్‌లో అన్ని పార్టీలు మద్దతు తెలిపితే.. జగన్, ఆయన ముఠా మాత్రం విష ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. "రాజధానిపై సాక్షి మీడియాలో జగన్ రెడ్డే ప్రశ్నలు వేసుకొని, ఆయనే సమాధానాలు చెప్పుకుంటున్నారు. గతంలో మూడు రాజధానుల పేరుతో ప్రజలను మభ్యపెట్టి ఐదేళు నరకం చూపించారు. ఇప్పుడు ప్రజా రాజధానికి దేశమంతా మద్దతిస్తుంటే, వైసీపీ ఎంపీలు పార్లమెంట్ నుంచి పారిపోయారు. దీన్నిబట్టే రాష్ట్రాభివృద్ధిపై వారికున్న చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతోంది" అని మంత్రి విమర్శించారు. రాయలసీమకు జగన్మోహన్ రెడ్డి తీరని ద్రోహం చేశారని బీసీ జనార్ధన్ రెడ్డి ఆరోపించారు. సీమకు నీళ్లిస్తే బంగారం పండిస్తారన్న సిద్ధాంతంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తుంటే, జగన్ మాత్రం అభివృద్ధికి అడ్డుపడుతున్నారని అన్నారు. "రాయలసీమ ప్రాజెక్టులపై చర్చకు రావాలని సవాల్ విసిరితే జగన్ పారిపోతున్నారు. తన ఐదేళ్ల పాలనలో రూ.12 లక్షల కోట్ల బడ్జెట్‌లో కనీసం రూ.2 వేల కోట్లు కూడా సీమ ప్రాజెక్టులకు ఖర్చు చేయని వ్యక్తి, ఇప్పుడు రాయలసీమ లిఫ్ట్ పేరుతో డ్రామాలు ఆడుతున్నారు" అని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం కేవలం 20 నెలల్లోనే రూ.8,000 కోట్లతో రాయలసీమ ప్రాజెక్టుల పూర్తికి చర్యలు తీసుకుందని మంత్రి వివరించారు. 738 కి.మీ. దూరంలో ఉన్న కుప్పానికి రూ.3,870 కోట్లతో హంద్రీనీవా నీటిని అందించిన ఘనత చంద్రబాబుదని గుర్తుచేశారు. శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతులకు రూ.203 కోట్లు కేటాయించామని, అవుకు రిజర్వాయర్ పనులను పూర్తి చేసి 20 వేల క్యూసెక్కుల నీటిని తరలించామని తెలిపారు. పులివెందులకు నీళ్లు తెచ్చిన చరిత్ర కూడా చంద్రబాబుదేనని స్పష్టం చేశారు. జగన్ పాలనలో ఇసుక దోపిడీ, నిర్వహణ లోపం వల్లే అన్నమయ్య ప్రాజెక్ట్ కొట్టుకుపోయి 39 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ 365 ద్వారా 102 సాగునీటి ప్రాజెక్టుల పనులను రద్దు చేసి, డ్యాముల మరమ్మతులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా జగన్ రాయలసీమకు అన్యాయం చేశారన్నారు. ప్రభుత్వ వేధింపుల వల్లే అల్ట్రాటెక్ వంటి పరిశ్రమలు రాష్ట్రం విడిచి వెళ్లిపోయాయని, ఇప్పుడు తాము ఓర్వకల్లును ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చి లక్షల కోట్ల పెట్టుబడులు తెస్తున్నామని చెప్పారు. కర్నూలు ఎయిర్‌పోర్ట్ కట్టింది, ఓర్వకల్లును అభివృద్ధి చేసింది టీడీపీ అయితే, ఏ సంబంధం లేని తన తండ్రి విగ్రహాలను అక్కడ పెట్టుకోవడం జగన్ నైజమని విమర్శించారు. రాయలసీమ అభివృద్ధి, సంక్షేమం కేవలం చంద్రబాబు నాయకత్వంతోనే సాధ్యమని ఆ ప్రాంత ప్రజలు బలంగా నమ్ముతున్నారని, 2024 ఎన్నికల్లో బుద్ధి చెప్పినా జగన్ తీరు మారలేదని అన్నారు.

## అనుమానాస్పదస్థితిలో వివాహిత ఆత్మహత్య



**ఏలూరు, పతాకం న్యూస్:** వివాహిత అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఏలూరు రూరల్ మండలంలో శనివారం చోటుచేసుకుంది. సంబంధిత వివరాల ప్రకారం .... ఏలూరు రూరల్ మండలం కొమడవోలు గ్రామానికి చెందిన అరవల్లి నాగమణి (44) భర్త పిల్లలతో కలిసి జీవిస్తుంది. ఈ క్రమంలో ఈరోజు ఇంటి వద్దనే ఫ్యాన్ కు గదిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించేసరికే ఆమె మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఏలూరు రూరల్ ఎస్సై జయ శర్మ ఐపీఎస్ అనుమానాస్పద మఅతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు.

## మధ్యాహ్న భోజనంపై విద్యార్థులు సంతృప్తిగా ఉన్నారు: మంత్రి కొల్లు

**కృష్ణా జిల్లా, పతాకం న్యూస్:** వివాహిత పెనమలూరు ప్రాంతంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలను సందర్శించిన మంత్రి విద్యార్థులతో మాట్లాడి టీచర్ల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో లావు బియ్యంతో భోజనం వడ్డించేవారని, ప్రస్తుతం సన్న బియ్యంతో మంచి భోజనం పెడుతున్నారని మంత్రికి విద్యార్థులు చెప్పారు. ఆ తర్వాత విద్యార్థులకు మంత్రి, ఎమ్మెల్యే స్వయంగా భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనంపై విద్యార్థులు చాలా సంతృప్తిగా ఉన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సన్న బియ్యంతో పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు మంచి భోజనం అందిస్తున్నామని తెలిపారు. ఆకుకూరలు, పప్పు కూరలు ఏ రోజు ఏమి వడ్డించాలో ఓ షెడ్యూల్ ప్రకారం భోజనం అందిస్తున్నామని అన్నారు. ప్రతిరోజు భోజనంతో పాటు ఒక గుడ్డు కూడా విద్యార్థుల ఆరోగ్యం కోసం ఇస్తున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో దొడ్డు బియ్యం, రేషన్ బియ్యంతో భోజనం పెట్టి విద్యార్థుల ఆరోగ్యంతో ఆడుకున్నారని విమర్శించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కింద విద్యార్థుల ఆరోగ్యమే ప్రధాన ఎజెండాగా భోజనాలు పెడుతున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో సుమారు 2500 పాఠశాలలకు మోడల్ కిచెన్లు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ పథకానికి మాత్రమే 2162 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ప్యూరిఫైడ్ మంచినీరు కూడా అందిస్తున్నామని చెప్పారు.

## అమరావతిపై జగన్ పగబట్టారు.. అందుకే 'మావిగన్' అంటున్నారు: అచ్చెన్నాయుడు



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్ర రాజధాని అమరావతి విషయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ విధ్వంసం సృష్టిస్తే, ముఖ్యమంత్రి చంద్రబాబు విజయం సాధించారని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. రాజధాని పనులు తిరిగి ప్రారంభం కావడం, అమరావతికి చట్టబద్ధత ఏర్పడడం వంటి పరిణామాలతో గత వారం రోజులుగా రాష్ట్రంలోని 5 కోట్ల మంది ప్రజలు పండుగ చేసుకుంటున్నారని ఆయన అన్నారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధాని అమరావతిపై జగన్ పగబట్టి విధ్వంసం సృష్టించారని, ఇప్పుడు 'మావిగన్' పేరిట మరో డ్రామాకు తెరలేపారని ఆరోపించారు. దేశంలో ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్, అయోధ్య రామమందిరం వంటి అనేక అంశాలపై రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయం రాలేదని, కానీ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి విషయంలో మాత్రం అన్ని పార్టీలు ఏకాభిప్రాయానికి వస్తే, ఒక్క వైసీపీ మాత్రమే వ్యతిరేకించిందని అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. "తెలుగు జాతిపైనా, అమరావతిపైనా జగన్ కి ఎందుకంత కక్ష?" అని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు ఎప్పుడూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోరని, 5 కోట్ల మంది ఆంధ్రుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకునే పనిచేస్తారని స్పష్టం చేశారు. 2014లో రాష్ట్ర విభజన జరిగినప్పుడు రాజధాని లేకుండా రాష్ట్రాన్ని అడ్డగోలుగా విడదీశారని, అప్పుడు కాంగ్రెస్‌లో కీలకపాత్ర పోషించిన వైసీపీ నేతలు రాష్ట్రానికి రాజధానిని సాధించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. 2014లో ప్రజలు విచక్షణతో చంద్రబాబును గెలిపించారని, ఆయన అధికారంలోకి రాగానే 13 గంటల పాటు శాసనసభలో చర్చించి, అన్ని పార్టీల ఆమోదంతోనే అమరావతిని రాజధానిగా ఎంపిక చేశారని వివరించారు. అప్పుడు ఇదే జగన్, నిండు సభలో అమరావతికి సంపూర్ణ మద్దతు తెలిపి, తాను కూడా ఇక్కడే ఇల్లు కట్టుకుంటానని చెప్పారని గుర్తుచేశారు. కానీ 2019లో 'ఒక్క అవకాశం' అంటూ ప్రజలను మాయమాటలతో నమ్మి అధికారంలోకి వచ్చాక, జగన్ తన మాట మార్చారని అచ్చెన్నాయుడు మండిపడ్డారు. అమరావతిని శ్మశానం, ఎడారితో పోలుస్తూ, ఒక కులానికే రాజధాని కడుతున్నారంటూ విష ప్రచారం చేశారని ఆరోపించారు. రాజధానిలో అవినీతి జరిగిందని ఆరోపణలు చేసినా, ఒక్కటీ నిరూపించలేకపోయారని అన్నారు. అమరావతి అనేది ప్రభుత్వ సొమ్ము ఒక్క రూపాయి కూడా ఖర్చులేని సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ అని, ఈ విషయాన్ని ప్రజలకు తెలియకుండా తప్పుడు ప్రచారం చేశారని విమర్శించారు. రాజధాని కోసం 29 వేల మంది రైతులు స్వచ్ఛందంగా 34 వేల ఎకరాల భూమి ఇస్తే, వారి త్యాగాన్ని జగన్ అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రాజధానుల పేరుతో మూడు ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి ప్రజలను మోసం చేశారని, కానీ ఏ ఒక్క ప్రాంతాన్ని కూడా అభివృద్ధి చేయలేదని దుయ్యబట్టారు. విశ్వసనీయత గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదని అన్నారు. ఇప్పుడు 'మావిగన్' పేరుతో మరో కొత్త నాటకానికి తెరలేపారని, ప్రజలు మరోసారి తిరగబడితే రాజకీయాల్లోనే లేకుండా చేస్తారని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి పనులు మళ్లీ వేగవంతం అయ్యాయని, తెలుగు ప్రజల భవిష్యత్తు అయిన అమరావతి ఏకైక రాజధానిగా కొనసాగుతుందని, దాని ద్వారానే అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## రిజిస్ట్రేషన్లలో టార్గెట్‌ను పూర్తి చేసిన అనకాపల్లి జిల్లా

## రూ.351.62 కోట్లు రాబడి



**అనకాపల్లి, పతాకం న్యూస్:** గడచిన ఆర్థిక సంవత్సంలో జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ప్రభుత్వ ఖజానాకు పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరింది. పది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి 2025–26లో రూ.331.6 కోట్లు ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించగా, రూ.351.62 కోట్లు రాబడి వచ్చింది. నర్సీపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం 277 శాతం ఆదాయంతో మొదటి స్థానంలో నిలవగా, కేవలం 15.18 శాతం ఆదాయంతో అట్టడుగున నిలిచింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటవుతుండడంతో భూముల క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా ఎలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం, పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గత ఆర్థిక సంవత్సరంలో భూములు, ఇతర స్థిరాస్తులు క్రయవిక్రయాలు బాగా పెరిగాయి. దీంతో రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంపు డ్యూటీ ద్వారా ప్రభుత్వానికి ఇబ్బడిముబ్బడిగా ఆదాయం వచ్చింది. జిల్లాలో మొత్తం పది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు వున్నాయి. 2025 ఏప్రిల్ ఒకటి నుంచి 2026 మార్చి 31 వరకు రూ.331.6 కోట్ల ఆదాయం రావాలని ఉన్నతాధికారులు టార్గెట్ విధించారు. అయితే అంచనాలకు మించి రూ.351.62 కోట్లు వసూలైంది. లక్ష్యం కంటే రూ.20.02 కోట్లు అధికంగా ఆదాయం వచ్చింది. మాడుగుల, అనకాపల్లి మినహా మిగిలిన ఎనిమిది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు లక్ష్యాన్ని అధిగమించడం విశేషం.నర్సీపట్నంలో ఆదా లక్ష్యం రూ.10.53 కోట్లు కాగా ఏకంగా రూ.29.17 కోట్లు (277.09 శాతం) వచ్చింది. సబ్బవరంలో రూ.25.12 కోట్లకుగాను 177.5 శాతం అధికంగా రూ.44.6 కోట్లు సమకూరింది. కె.కోటపాడులో రూ.9.6 కోట్లకుగాను రూ.13.02 కోట్లు (135.56 శాతం) వచ్చింది. మిగిలిన నక్కపల్లిలో రూ.34.4 కోట్లకు రూ.41.62 కోట్లు, ఎలమంచిలిలో రూ.36.4 కోట్లకు రూ.47.55 కోట్లు, లంకెలపాలెంలో రూ.52.46 కోట్లకు రూ.59.9 కోట్లు, చోడవరంలో రూ.18.51 కోట్లకు రూ.21.05 కోట్లు, కోటవురట్లలో రూ.14.59 కోట్లకు రూ.17.63 కోట్లు వచ్చాయి. రిజిస్ట్రేషన్ ఆదాయంలో ఎప్పుడూ ముందువరుసలో వుండే అనకాపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఈసారి కాస్త వెనుకబడింది. రూ.81.11 కోట్ల ఆదాయం లక్ష్యం కాగా రూ.69.66 కోట్లు మాత్రమే వచ్చింది.. మాడుగులలో రూ.48.88 కోట్లు ఆదాయం లక్ష్యంకాగా కేవలం రూ.7.42 కోట్లు (15.18 శాతం) మాత్రమే వచ్చింది.

# రాజధాని నిర్మాణ పనులపై చంద్రబాబు సమీక్ష




**అమరావతి, పతాకం న్యూస్:** అమరావతి రాజధాని నిర్మాణ పనులను నిర్దేశిత లక్ష్యాల ప్రకారం సకాలంలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. నిర్ణయించిన గడువులో పనులు పూర్తి చేసి ప్రధానితో ప్రారంభోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. పనుల వేగాన్ని పెంచి పూర్తి చేయడానికి కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోవాలని, అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. రాజధాని నిర్మాణాన్ని సాధారణ కాంట్రాక్ట్ పనిగా కాకుండా చారిత్రక బాధ్యతగా భావించాలని సూచించారు. పనుల్లో జాప్యం చేస్తున్న సంస్థల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణంలో పాల్గొంటున్న కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారాయణతో కలిసి ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఇటీవల జరిగిన అగ్నిప్రమాదాల నేపథ్యంలో నిర్మాణ సంస్థల నిర్లక్ష్యాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. నిర్మాణ సామాగ్రి భద్రత బాధ్యత కాంట్రాక్టర్లదేనని స్పష్టం చేశారు. ఈ నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయని మండిపడ్డారు. ఘటనల తర్వాత తగిన స్పందన లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని వర్గాలు రాజకీయ ప్రయోజనాల కోసం విషయాలను వక్రీకరిస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా అనూహ్య ఘటన చోటు చేసుకుంటే వెంటనే సమాచారం అందించాలని ఆదేశించారు. సమర్థులైన ప్రాజెక్ట్ మేనేజర్లను నియమించుకోవాలని, లేదంటే ప్రభావం ప్రభుత్వంపై పడుతుందని హెచ్చరించారు. ఇసుక, గ్రావెల్ సరఫరాలో ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కృష్ణా జిల్లాలో గ్రావెల్ సరఫరా సమస్యపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ గ్రీన్ ఛానల్ ద్వారా సరఫరా జరగాలని ఆదేశించారు. ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులకు అవసరమైన కార్మికుల కొరతపై కాంట్రాక్టర్లు సీఎం చంద్రబాబుకు వివరించారు. వివిధ రాష్ట్రాల్లో ఎన్నికల కారణంగా కార్మికులు వెళ్లిపోయారని తెలిపారు. స్థానికంగా లభ్యమయ్యే నైపుణ్య కార్మికులను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. పనుల్లో ఉపయోగిస్తున్న యంత్రాలపై కూడా సమీక్ష నిర్వహించారు.

అవసరమైన 5,580 యంత్రాల్లో ప్రస్తుతం 3,767 మాత్రమే అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. అదనంగా హాట్ మిక్స్, వెట్ మిక్స్, ఆర్ఎంసీ యంత్రాలు వినియోగంలో ఉన్నాయని వివరించారు. వారం, నెల వారీ లక్ష్యాలతో పనులు కొనసాగించాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం వారానికి రూ. 941 కోట్ల విలువైన పనులు పూర్తి చేయాల్సి ఉందని పేర్కొన్నారు. వర్షాకాలానికి ముందే కీలక పనులు ముగించాలన్నారు. ఒకేసారి ఎక్కువ ప్రాజెక్టులు చేపడుతున్న సంస్థలు మరింత దృష్టి సారించాలని సూచించారు. రాజధాని నిర్మాణానికి నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. రాజధానిలో మొత్తం రూ. 57,821 కోట్ల విలువైన పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, అందులో రూ. 50,943 కోట్ల పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని అధికారులు తెలిపారు.

## ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోవాలి: లోకేశ్



**కర్ణాటక, పతాకం న్యూస్:** ఏపీ విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కర్ణాటకలోని రాయచూర్ జిల్లా సింధనూరులో శనివారం పర్యటించారు. మంత్రి నారా లోకేశ్ ఉదయం కర్ణాటకలోని సింధనూరుకు చేరుకున్నారు. స్థానిక తెలుగు యువత ఆయనకు ఘన స్వాగతం పలికింది. భారీ గజమాలతో లోకేశ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ సమాజంలో పిల్లలు చాలా సున్నితంగా మారిపోయారు. ఒక్క పరీక్షలో ఫెయిల్ అయితే ఆత్మహత్య చేసుకునే పరిస్థితి చూస్తున్నామని, జీవితంలో ఓటమి సహజమని దాని నుంచి అనేక పాఠాలు నేర్చుకోవాలన్నారు. "ఎన్నికలకు ముందు ఏ తప్పూ చేయని మా పెద్దాయన (చంద్రబాబు)ను అక్రమంగా జైలులో పెట్టారు. ఏ తప్పూ చేయకుండా జైలులో పెట్టినందుకు నేను తీవ్రంగా బాధపడ్డాను. కానీ, ఆ క్లిష్ట సమయంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలంతా మా కుటుంబానికి అండగా నిలబడ్డారు. నాడు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ జీవితాంతం రుణపడి ఉంటాను" అని ఏపీ విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఉద్వేగంగా అన్నారు. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా సింధనూరులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తన తండ్రి అరెస్టు నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సమాజంలో నైతిక విలువల ఆవశ్యకత గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. యువగళం జెండాలు చేతబూని 'జై లోకేశ్' అంటూ నినాదాలు చేశారు. సింధనూరులోని ఎంజీ సర్కిల్ నుంచి గంగావతి రోడ్డు వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కేంద్ర మంత్రులు హెచ్.డీ కుమారస్వామి, సంజయ్ సేథ్ పాల్గొన్నారు. ఉత్సాహంగా సాగిన ఈ ర్యాలీలో ప్రజలందరికీ అభివాదం చేస్తూ లోకేశ్, కేంద్ర మంత్రులు ముందుకు సాగారు. ర్యాలీ అనంతరం హోసల్లీ క్యాంప్ గంగావతి రోడ్డులోని కమ్మవారి కల్యాణ మండపం వద్దకు చేరుకున్నారు. అక్కడ స్వర్గీయ ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని కేంద్ర మంత్రులతో కలిసి లోకేశ్ ఆవిష్కరించారు. అనంతరం హోసల్లీ క్యాంప్‌లో నూతనంగా నిర్మించిన 'శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్'ను ప్రారంభించారు. సైనిక్ స్కూల్ హాస్టల్ భవనాన్ని కూడా ప్రారంభించారు. స్థానిక తెలుగు వారి యాజమాన్యంలోని విద్యా సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఈ సైనిక్ స్కూల్‌ను మంజూరు చేయడం విశేషం. చంద్రబాబు అరెస్టు నాటి కష్టకాలాన్ని లోకేశ్ గుర్తు చేసుకున్నారు. అక్రమ అరెస్టును నిరసిస్తూ కర్ణాటక తెలుగు ప్రజానీకం పెద్ద ఎత్తున ర్యాలీలు చేశారని ఆయన గుర్తు చేశారు. వారి రుణం తీర్చుకునేందుకే ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. "పెద్దాయనను జైలులో పెట్టగానే, మనకు ఈ రాజకీయాలు అవసరమా? అని నా భార్య బ్రాహ్మణి నన్ను అడిగింది" అని లోకేశ్ చెప్పారు. "అందుకు తాను ఒకటే సమాధానం చెప్పానన్నారు. ప్రపంచంలో ఉన్న తెలుగోళ్లంతా మనకు అండగా నిలబడ్డారని బదులిచ్చానని" ఆయన వివరించారు.


## పాడేరు, అరకులోయలో అన్నక్యాంటీన్ల నిర్మాణాలు పూర్తి



**పాడేరు, అరకు, పతాకం న్యూస్:** ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో అన్న క్యాంటిన్‌లను ఏర్పాటుచేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పాడేరు, అరకులోయల్లో అన్నక్యాంటీన్లను ఏర్పాటు చేస్తోంది. జిల్లా కేంద్రం పాడేరులో ఎన్‌టీఆర్ రైతుబజార్‌లోను, అరకులోయలో టౌన్‌కు సమీపంలో అన్న క్యాంటీన్లను నిర్మించారు. ఒక్కో క్యాంటీన్ నిర్మాణానికి రూ.51 లక్షలు చొప్పున కేటాయించారు. ప్రస్తుతం అన్ని పనులు తుది దశకు చేరడంతో త్వరగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయడంతో పేదలకు, ఇతర పాంతాల నుంచి వచ్చే మారుమూల ప్రాంతాల గిరిజనులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. కేవలం రూ.5లకు రుచికర, నాణ్యమైన భోజనం అందిస్తుండడంతో పేదలకు విశేషంగా ఉపయోపడుతుందని కూటమి నేతలు భావిస్తున్నారు. అన్న క్యాంటీన్ల ఏర్పాటుతో పేదలకు తక్కువ ఖర్చుతో చక్కని ఆహారం లభ్యమవుతుందని వారంటున్నారు. రాష్ట్రంలో అన్న క్యాంటీన్ల ఏర్పాటుపై కూటమి ప్రభుత్వం మొదట్లో ప్రకటించిన జాబితాలో పాడేరు, అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గాల పేర్లు లేవు. దీంతో ఏజెన్సీ ప్రాంతంలో వీటిని నిర్మించాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదని వైసీపీ శ్రేణులు అప్పట్లో ప్రచారం చేశాయి. ఈ రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ వైసీపీ ఎమ్మెల్యేలుండడంతో కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపడం లేదని భావించారు. కాని వారి అంచనాలు, ప్రచారాన్ని తారుమారు చేస్తూ పాడేరు, అరకులోయ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లను మంజూరు చేయడం, జోరుగా నిర్మాణ పనులు చేపట్టి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయడంపై మన్యం వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## అధ్వానంగా తుమ్మనవలస-గుమ్మకోట రోడ్డు

**అనంతగిరి, పతాకం న్యూస్:** మండలంలోని తుమ్మనవలస-గుమ్మకోట రోడ్డు అధ్వానంగా మారింది. ఏళ్ల తరబడి మరమ్మతులు లేకపోవడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. దీంతో 30 గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. తుమ్మనవలస వంతెన దాటిన నుంచి భీంపోల్ వెళ్లే వరకు సీసీ రోడ్డు అధ్వానంగా తయారైంది. తుమ్మనవలస వలస నుంచి గుమ్మకోట వరకు ఉన్న 18 కిలోమీటర్ల రోడ్డును 15 ఏళ్ల క్రితం నిర్మించారు. ఈ రోడ్డు నిర్వహణను ఆర్అండ్‌బీ చూడాలి. ఆ శాఖ అధికారులు ఈ రోడ్డును అసలు పట్టించుకోవడం మానేశారని గిరిజనులు ఆరోపిస్తున్నారు. రోడ్డుకు ఆనుకుని తుప్పలు తొలగించకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాలకు ఎక్కడికక్కడ రోడ్డంతా కోతకు గురైంది. తట్టవలస-మండిపర్తి మధ్యలోని 300 మీటర్ల సీసీరోడ్డు పాడైపోయింది. గొంద్రంగిపాడు




గ్రామం వద్ద రోడ్డంతా పూర్తిగా కొట్టుకుపోయి గుంత ఏర్పడింది. నేరడువలస- భీంపోల్ మధ్యలోని సీసీ రోడ్డంతా కోతకు గురైంది. భీంపోల్-లువ్వా కాజ్‌వే అటు ఇటు సీసీరోడ్లు పూర్తిగా కొట్టుకుపోయి, గుంతలు ఏర్పడ్డాయి. విజయనగరం జిల్లా ఎస్.కోట నుంచి తుమ్మనవలస మీదుగా గుమ్మకోట వరకు ప్రతిరోజూ ఆర్టీసీ బస్సు నడుస్తుంది. ఎస్.కోటలోని ఉదయం 6 గంటలకు బయలుదేరి గుమ్మకోటకు 7.30 గంటల చేరుతుంది.

## ప్రేమిస్తానని చెప్పి మోసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసిన దేవరాపల్లి పోలీసులు



- ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తులను నమ్మొద్దు: ఎస్సై సత్యనారాయణ
- చనిపోవడం, ఆత్మహత్యలు చేసుకోవటం సరికాదంటున్న పోలీసులు
- చాకచాక్యంగా నిందితుడిని పట్టుకున్న డీఎస్పీ శ్రీనివాసులు
- సహకరించిన దేవరాపల్లి పోలీసులు

**దేవరాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలో మహిళ ఆత్మహత్య కేసు సంచలనం రేవున యువతి కేసులో నిందుతున్న అరెస్టు చేసిన దేవరాపల్లి పోలీసులు . దేవరాపల్లి పోలీస్ స్టేషన్ క్రైమ్ నెంబర్ 35/2026 కేసులో ముద్దాయి కొల్లి లోకేష్ అనే యువకడిని దేవరాపల్లి మండలం, రైవాడ రిజర్వాయర్ సమీపంలో ఉన్నా,ఇంచార్జ్ డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు నిందితుడిని గుర్తించి శుక్రవారం సాయంత్రం 4 గంటలకు అరెస్టు చేసిన ఎస్ఐ సత్యనారాయణ ఈ కేసుకు సంబంధించినటువంటి విషయాలను చాకచౌక్యంగా ఆలోచన చేసి అసలు నిందితుడు ఎవరా అని గుర్తించి జల్లుడు పట్టి,ఈ కేసుకు సంబంధించి,బాధితురాలు దూసరి లక్ష్మి గత నెల 30న సాయంత్రం 6.45నిముషాలు ప్రాంతంలో ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు గుర్తించారు.రెండో రోజు 31న తండ్రి పెంటయ్య పిర్యాదు చేసి కేసు నమోదు చేసారు.విచారణలో తెలిసిన కొన్ని విషయాలు , కొల్లి లోకేష్ అనే యువకడు గత నాలుగు సంవత్సరాలుగా లక్ష్మిని ప్రేమించి, ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకున్నాడు. అనంతరం " గిరిజన కుటుంబం కావడంతో, మొఖం చాటేసి గిరజన కులం కారణంగా పెళ్లి చేసుకోనని నిరాకరించి, "ఏం చేసుకున్నా నాకు సంబంధం లేదు" అని చెప్పడంతో ఆమె అంటే ప్రేమికరాలు తీవ్ర మనస్థాపానికి గురిఅయి, చావే శరణ్యం అని కొన్ని పరిణామాల వలన లక్ష్మి ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించబడింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేసి, తదుపరి విచారణ కొనసాగుతుంది. మృతురాలు దూసురి లక్ష్మి అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పినకోట పంచాయతీ కోరపర్తి గ్రామానికి చెందిన మహిళగా గుర్తించారు. ఇలాంటివి పునరావతం కాకుండా ప్రేమ పేరుతో వంచించిన ఎవరినైనా ప్రశ్నించే తత్వం ఉండాలి తప్ప చావు అనే మాట రాకుండా తలెత్తుకునే బతికే అవకాశం ఉండాలని దేవరాపల్లి ఎస్సై మీడియా సమావేశంలో అన్నారు.

## త్వరలో వరహా నది రక్షణ గోడ పనులు ప్రారంభం



**ఎస్.రాయవరం, పతాకం న్యూస్:** మండలంలోని సోముదేవుపల్లి వద్ద కోతకు గురవుతున్న వరహా నది గట్టుకు రక్షణ గోడ నిర్మాణానికి ప్రభుత్వం రూ.9.95 కోట్లు మంజూరు చేసిందని, కొద్ది రోజుల్లో టెండర్ ప్రక్రియను పూర్తిచేసి, పనులు ప్రారంభిస్తామని జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ వై.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన డీసీఈ ఆంజనేయులు, ఎస్ఈ అప్పలనాయుడు, ఈఈ వి.బాలసూర్యంతో కలిసి సోముదేవుపల్లి వద్ద వరహా నది గట్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంజూరైన నిధులతో నది గట్టు కోతకు గురైన ప్రదేశం వద్ద రక్షణ గోడ నిర్మాణం, గ్యాప్ ఫిల్లింగ్, రెండు మదుములు, గ్రోయిన్ నిర్మాణం చేపడతామని, ఇంకా రెండు పంట కాలువల్లో పూడిక తీయిస్తామని చెప్పారు. ఆయన వెంట జలవనరుల శాఖ డీఈ ఎంవీ సురేశ్‌కుమార్, ఏఈ అమీనా భాను వున్నారు.

## పుదుచ్చేరి రాష్ట్ర హోదాకు టీవీకే కృషి: విజయ్



**పుదుచ్చేరి, పతాకం న్యూస్:** కేంద్రంలో ఏళ్ల తరబడి అధికారంలో ఉన్నప్పటికీ పుదుచ్చేరికి రాష్ట్ర హోదా కల్పించడంలో జాతీయ పార్టీలు విఫలమయ్యాయని బీజేపీ, కాంగ్రెస్‌పై టీవీకే చీఫ్ విజయ్ విమర్శలు గుప్పించారు. పుదుచ్చేరికి చట్టబద్ధంగా పూర్తి స్థాయి రాష్ట్ర హోదా సాధించేందుకు టీవీకే నూటికి నూరు శాతం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా శనివారంనాడిక్కడ జరిగిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. పుదుచ్చేరిలోని డీఎంకే-కాంగ్రెస్ కూటమిని 'అయోమయ కూటమి'గా విజయ్ అభివర్ణించారు. ఏఐఎన్ఆర్సీ-బీజేపీ కూటమి శక్తిహీనంగా మారిందని చెప్పారు. టీవీకే విజిల్ గుర్తుకు ఓటు వేసి తమ పార్టీగా మద్దతుగా నిలవాలని, కేవలం ఒక్క వేలితో రాజకీయ మార్పు (వన్ ఫింగర్ రివల్యూషన్) తీసుకురావాలని ప్రజలను కోరారు. తమ పార్టీ అభ్యర్థులు ప్రజలకు అండగా నిలబడతారని తెలిపారు. టీవీకే అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. టీవీకే అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తామని, పేదరికపు రేఖకు దిగువనున్న ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పారు. పుదుచ్చేరి యూనివర్శిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ అండ్ ఆర్ట్స్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. పుదుచ్చేరి అబివృద్ధికి కట్టుబడి ఉంటామని, సురక్షితమైన, పారదర్శక పాలనను అందిస్తామని విజయ్ హామీ ఇచ్చారు. పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# వెంటనే వీఆర్వోలకు పేస్కేలు అమలు చేయాలి



**విజయనగరం, పతాకం న్యూస్:** విఆర్ఎల సమస్యలు పరిష్కరించి తెలంగాణ వలే పే స్కేలు అమలు చేయాలని కోరుతూ అశోక్ బంగ్లాలో స్థానిక ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మికి విఆర్ఎల సంఘం నాయకులు వినతి అందజేశారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.గురుమూర్తి , సిఐటియు జిల్లా కోశాధికారి ఎ. జగన్మోహన్‌రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుండి విఆర్ఎల వ్యవస్థ ఉందని, దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు , జనన, మరణ ధ్రువీకరణ, భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి పనిచేస్తున్నామన్నారు. ప్రస్తుత ధరల్లో నెలకు పదివేల వేతనంతో జీవనం సాగించడం కష్టంగా ఉందని, తెలంగాణ వలే పే స్కేల్ అమలు చేయాలని , నామినీ విఆర్ఎలను రెగ్యులర్ విఆర్ఎలుగా గుర్తించాలని, అర్హత ఉన్నవారికి 4వ తరగతి ఉద్యోగులుగా ప్రమోషన్లు ఇవ్వాలని, అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు అప్పారావు, రాములప్పుడు, నాయకులు గౌరీ ,పైడిరాజు పాల్గొన్నారు.

## మున్సిపాల్టీ సమస్యల పరిష్కారానికి దారేదీ?



**పార్వతీపురం, పతాకం న్యూస్:** మున్సిపాలిటీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించకుండా ప్రభుత్వాలు గత ఐదేళ్లుగా తాత్సారం చేశాయి. గడచిన ఐదేళ్లలో పట్టణ ప్రజలు ఎన్నుకున్న పాలకవర్గాలు కేవలం ఉత్సవ విగ్రహాలుగా మిగిలాయి. మున్సిపాలిటీల్లో చిన్న చిన్న సమస్యలు మాత్రమే పరిష్కరించ గలిగిన పురపాలకులు దీర్ఘకాలిక సమస్యల నుంచి గట్టెక్కించలేకపోయారు. పట్టణ ప్రజలు అనేక ఏళ్లుగా ఇబ్బంది పడుతున్న సమస్యల పరిష్కారానికి దారి చూప లేకపోయారు. దీనికి ప్రధాన కారణం గడిచిన ఐదేళ్లలో రాష్ట్రాన్ని పాలించిన వైసిపి, టిడిపి ప్రభుత్వాల నిర్లక్ష్యమేనని చెప్పవచ్చు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సంక్షేమ పథకాల హామీల అమలుకు ప్రాధాన్యతచ్చిన పాలకులు పట్టణాల్లో తిష్ట వేసి ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోలేదు. దీంతో మున్సిపాలిటీల్లో ఎక్కడి సమస్యలు అక్కడే అన్న చందంగా ఉన్నాయి. మున్సిపాలిటీలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు మంజూరు చేయకపోవడంతో పరిష్కారానికి నోచుకోలేదు. పేదలకు సంక్షేమ పథకాల అమలుపై దృష్టి పెట్టిన ప్రభుత్వాలు అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం వహించాయి. రెండేళ్ల క్రితం అసెంబ్లీ ఎన్నికల ముందు పట్టణ సమస్యల పరిష్కారానికి ఎన్నెన్నో హామీ లిచ్చిన ప్రస్తుత ఎమ్మెల్యేలు కనీసం స్పందించిన దాఖలాల్లేవు. సమస్యల వలయంలో మున్సిపాల్టీలుజిల్లాలో పార్వతీపురం, సాలూరు మున్సిపాలిటీలు, పాలకొండ నగరపంచాయితీ వున్నాయి. పార్వతీపురం మున్సిపాలిటీ జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత కూడా సమస్యలు స్తంభించిపోయింది. ప్రభుత్వ భూములు, చెరువుల కబ్జాలు విపరీతంగా పెరిగాయి. ఆ స్థలాల్లో రియల్ ఎస్టేట్ అపార్ట్మెంట్లు వెలిశాయి. సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మాత్రం అలాగే ఉన్నాయి. జిల్లా కేంద్రంగా ఉన్న మున్సిపాలిటీలో వారానికి ఒకరోజు మాత్రమే తాగునీటి సరఫరా చేసే పరిస్థితి కనిపిస్తోంది. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేలు ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచిన దాఖలా ల్లేవు. పట్టణానికి డంపింగ్ యార్డ్ కూడా పెద్ద గుదిబండగా తయారైంది. రాయగడ రోడ్డులో జాతీయ రహదారి పక్కనే డంపింగ్ యార్డ్ నిర్వహిస్తుండంతో సమీప గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. డంపింగ్ యార్డ్ కంపుభరించలేక పోతున్నామని ఆవేదన చెందుతున్నారు సాలూరు పట్టణంలోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది. గత నాలుగేళ్లుగా పట్టణంలోని సామాజిక మరుగుదొడ్లు పని చేయడం లేదు. వాటిని మరమ్మతు పనులు చేయడానికి కూడా మున్సిపాలిటీలో నిధుల్లేవు. పట్ణణంలో తాగునీటి సరఫరాకు సంబంధించి పెద్ద సమస్యలు లేకపోయినా పైపులైన్ లీకేజీ సమస్యలు వున్నాయి. నెలనెలా కార్మికులకు జీతాలు ఇచ్చుకునే పరిస్థితి కూడా లేదు. రెవెన్యూ వసూళ్లు అంతంత మాత్రంగానే ఉండడంతో ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. పాలకొండ నగరపంచాయితీలోనూ ప్రజలు పారిశుధ్య నిర్వహణ, డంపింగ్ యార్డ్ సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఏళ్లతరబడి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. తాగునీటి సమస్యకు కూడా వేధిస్తోంది. పట్టణ జనాభా పెరుగుతున్నా అందుకు తగ్గట్టుగా రోడ్లు విస్తరణ నోచుకోవడంలేదు. ఇలాంటి పరిస్థితుల్లో సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా మున్సిపాలిటీల్లో వార్డుల సంఖ్య పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనివల్ల తమకేం లాభమమని పురజనులు పెదవి విరుస్తున్నారు.

## స్మార్ట్ కిచెన్‌ల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి




**విజయనగరం, పతాకం న్యూస్:** ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు అందించే మధ్యాహ్న భోజన పథకం స్థానంలో స్మార్ట్ కిచెన్‌లు ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికులు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌పిఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మధ్యాహ్న భోజనం నిర్వాహణణు స్మార్ట్ కిచెన్లకు ఇవ్వొద్దని, వేడివేడి భోజనాన్ని పిల్లలకు దూరం చెయ్యొద్దని, మధ్యాహ్న భోజన నిర్వాహకుల ఉపాధిని తీయొద్దని అన్నారు. వచ్చే ఏడాది నుంచి పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికుల స్థానంలో స్మార్ట్ కిచిన్‌ల ద్వారా పిల్లలకు భోజనాలు పంపించాలని నిర్ణయించడం అన్యాయమని అన్నారు. దీనివల్ల జిల్లాలో ఉన్న 4వేల మంది కార్మికుల ఉపాధి పోతుందన్నారు. గత 25ఏళ్లగా బిల్లులు రాకపోయినా, జీతాలు రాకపోయినా, అప్పులు చేసి పుస్తెలతాళ్లు తాకట్టు పెట్టి పిల్లలకు వేడివేడి భోజనం పెట్టారన్నారు. నేడు ప్రభుత్వం స్మార్ట్ కిచెన్ల పేరుతో ప్రైవేటీకరణ చేసేందుకు నిర్ణయించడం అన్యాయమన్నారు. గతంలో జిల్లాలో నెల్లిమర్ల ప్రాంతం నవప్రయాస్‌కు ఇవ్వడానికి ప్రయత్నం చేశారని, సిఐటియు, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన పోరాటం చేయడంతో ప్రభుత్వం దిగివచ్చి ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుందన్నారు. స్మార్ట్ కిచెన్‌ల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే పెద్ద ఎత్తున పిల్లల తల్లిదండ్రులు, ప్రజలు, ప్రజా సంఘాలతో పెద్దఎత్తున పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పిల్లలకు మెనూ ఛార్జి 20 రూపాయలు పెంచాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. విలేకర్ల సమావేశంలో యూనియన్ అధ్యక్షురాలు మంగళలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మి, సీత, దేవి పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాలు కేటాయించండి

**పలాస, పతాకం న్యూస్:** ఆఫ్‌షోర్ రిజర్వా యర్ నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని బాధితులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే గౌతు శిరీషను రేగులపాడు గ్రామ స్థులు కలిసి విన్న వించారు. ఎమ్మెల్యే కార్యా లయంలో గ్రీ వెన్స్ నిర్వ హించగా.. నిర్వాసి తులు తమకు స్థలాలు కేటా యించి ఆదుకో వాలన్నారు. 50 మంది వరకూ నిర్వా సితులకు గృహాలు కట్టు కోవడానికి స్థలాలు ఇవ్వ లేదన్నారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారుల దృష్టికి ఈ సమస్య తీసుకు వెళ్లి పరిష్క రిస్తామన్నారు. అదేవిధంగా మామిడిపల్లి గ్రా మానికి చెందిన జె.రామారావుకు సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే అందించారు. అనంతరం పలాస నియోజకవర్గం వివిధ మండలాలు, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటి నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ పీరుకట్ల విఠల్‌రావు, టీడీపీ నాయకుడు కొర్ల కన్నారావు తదితరులు ఉన్నారు.

## ఉపాధి చట్టాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలి



**విజయనగరం, పతాకం న్యూస్:** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, వి బి జి రామ్ చట్టాన్ని రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి సాంబమూర్తి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఉపాధి పనులు పాత పద్ధతులో జరగాలని, పేస్ యాప్ రద్దు చేయాలని, పని చేసే ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఉపాధి కూలీలతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ వామపక్షాల మద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వం 2006లో ప్రారంభించిన ఉపాధి హామీ చట్టం ప్రకారం కూలీలంతా పని కల్పించడం లేదన్నారు. కొంతమందికి పని ఇస్తున్నారని, కొంతమందికి పని కల్పించడం లేదని గ్రామాల్లో 10 గ్రూపులుంటే ఐదు గ్రూపులకు వారం రోజుల పాటు మిగతా ఐదు గ్రూపులకు మరో వారం రోజులు పాటు పని కల్పించే పరిస్థితి ఉందన్నారు. గ్రామాల్లో ఉపాధి కూలీలందరికీ పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలను తీవ్రవాదుల్లా పేస్ యాప్ పెట్టి పని ఇచ్చినట్లే ఇచ్చి ఎగ్గొట్టే పరిస్థితి ఉందన్నారు. దీనివల్ల ఉపాధి కూలీలకు పని లేకుండా పోతుందని, రోజూ పనిచేసే చోటకు వెళ్లి ముఖ ఆధారిత హాజరును వేయడం, హాజరు పడకపోతే పని లేకుండా కొంతమంది పనిచేస్తే మరి కొంతమంది తిరిగి ఇంటికి వెళ్లిపోవడం జరుగుతుందని తెలిపారు. దీంతో మండలంలో వందలామంది కూలీలు ఉపాధి హామీ పని లేకుండా పోతుందన్నారు. పేస్ యాప్ రద్దు చేయాలని, అలాగే కనీసం కూలి రాని పరిస్థితుల్లో వేతనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మూడు నాలుగు వారాలు చొప్పున పని చేసిన నేటికీ కూలి డబ్బులు అందలేదని, వెంటనే కూలి డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక్క పూట మాత్రమే పని కల్పించాలని మౌలిక సదుపాయాలు కల్పించాలని, అలాగే రోజు కూలి రూ.600, ఏడాదికి 200 రోజులు పని కల్పించి పాత పద్ధతుల్లోనే ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రామారావు, వెంకటేష్, ఉపాధి కూలీలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## రాజధాని రైతులపై ఉన్న ప్రేమ... ముంపు బాధితులపై కూడా చూపాలి



**నంద్యాల, పతాకం న్యూస్:** రాజధాని రైతులపై ఉన్న ప్రేమ శ్రీశైలం నీటి ముంపు బాధితులపై కూడా చూపాలని, జీవో 98ను అమలు చేయాలని శ్రీశైలం నీటిమగు బాధితులు డిమాండ్ చేశారు. శనివారం నందికొట్కూరులో జీవో 98 బాధితుల రిలే నిరాహార దీక్షలు 10 వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నీటి ముంపు బాధితుడు నెహ్రూ నగర్ జయన్న మాట్లాడుతూ ... 2017-19, 24 సంవత్సరంలో నీటిముంపు బాధితులకు అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన పాలకులు నేడు అధికారంలోకి వచ్చాక మరిచిపోయారా ? అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నీటి ముంపు బాధితులకు ఉద్యోగాలు రాకపోవడంతో ఇప్పటికే 32 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. మరింత కాలయాపన చేస్తే మరిన్ని ఆత్మహత్యలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. 98 జీవో బాధితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, నారాయణ, రాజు, నాగేంద్రుడు, రవి మురళి తదితరులు పాల్గొన్నారు.

## లారీ కింద పడి దంపతుల మృతి

**సత్తెనపల్లి, పతాకం న్యూస్:** నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల ఎంతోమంది అమాయకుల ప్రాణాలు పోతున్నాయని, వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులు ఎన్నిసార్లు చెబుతున్నా.. వాహనదారులు వినిపించు కోవడం లేదు. ఏపీలో రెండు వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మరణించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. పట్టణంలోని తాలూకా సెంటర్ వద్ద బైక్ అదుపు తప్పి లారీ కిందపడటంతో వృద్ధ దంపతులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

## పిచ్చి కుక్క స్వైరవిహారం..
## ముగ్గురికి గాయాలు



**పార్వతీపురం, పతాకం న్యూస్:** గరుగుబిల్లి మండలం నాగురులో ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేసి ముగ్గురిని గాయపరిచింది. గుడ్‌ఫ్రైడే ప్రార్థనల నేపథ్యంలో తల్లిదండ్రులతో కలిసి స్థానిక చర్చికి వచ్చిన రెండేళ్ల మండంగి లిఖిత బయట ఆడుకుంటుండగా కుక్క ఒక్కసారిగా ఆమె తలపై విరుచుకుపడి తీవ్రంగా గాయపర్చింది. చిన్నారిని కాపాడే ప్రయత్నంలో చింతల అప్పలనాయుడు, అక్కేన చంద్రశేఖరనాయుడు (చినబాబు)పై కూడా కుక్క దాడి చేసి గాయపరిచింది. అనంతరం వీధుల్లోకి పరుగులు తీసిన ఆ కుక్క అక్కేన సింహచలం, మరో వ్యక్తికి చెందిన గేదె దూడలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. క్షతగాత్రులను వెంటనే పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. జిల్లాలో ఇటీవల కాలంలో చిన్నారులపై కుక్కల దాడులు వరుసగా జరుగుతుండడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## పారిశ్రామికాభివృద్ధి వేగవంతానికి చర్యలు



**పార్వతీపురం, పతాకం న్యూస్:** జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఇండిస్టీస్ అండ్ కామర్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ యువరాజ్ జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డితో కలిసి మండలంలోని పెదకంచూరులో పర్యటించి గ్రామ సమీపాన అల్యూమినియం స్మెల్టర్ యూనిట్ ఏర్పాటుకు సంబంధించి ముందస్తు సాధ్యాసాధ్యాలను పరిశీలించడానికి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ, సర్వేయర్, అటవీశాఖ అధికారులతో మాట్లాడి భూమికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన అప్రోచ్ రోడ్ల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై గల అవకాశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ యువరాజ్ మాట్లాడుతూ, జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి భూముల వినియోగంపై సమగ్రంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పరిశ్రమల అధికారి సీతారాం, తహశీల్దార్ రవి, పరిశ్రమల ప్రోత్సాహక అధికారి బ్రహ్మాజీ, ఎపిఐఐసి అధికారులు, సర్వేర్లు, సచివాలయ, సాలూరు రూరల్ సిఐ రామకృష్ణ, ఎస్ఐ అర్జున్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సెక్యూరిటీ గార్డ్స్ రిలే నిరాహార దీక్ష

**కాకినాడ, పతాకం న్యూస్:** కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి, రంగరాయ వైద్య కళాశాలలో సెక్యూరిటీ సేవలందిస్తున్న కార్మికులకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జీతాలు పెంచాలని, క్యాజువల్ లీవులు అమలు చేయాలని, అక్రమంగా విధులకు దూరం చేసిన గార్డ్స్ ని డ్యూటీలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో జిజిహెచ్ సెక్యూరిటీ కార్యాలయం వద్ద మార్చి 25 న ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలు 11వ రోజైన శనివారం కూడా నిర్వహించారు. సిఐటియు నగర కమిటీ సభ్యుడు ముత్యాల రవిశంకర్ దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .... జిజిహెచ్ లో సెక్యూరిటీ గార్డ్స్ కి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. శ్రీ కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ యాజమాన్యం నిర్లక్ష్యం వీడి సెక్యూరిటీ గార్డ్స్ తో చర్చలు జరపాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సెక్యూరిటీ కాంట్రాక్ట్ యాజమాన్యం దిగి వచ్చేవరకు ఆందోళన కొనసాగించాలన్నారు. సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ .... ఆర్ఎంసి సెక్యూరిటీ గార్డ్స్ కి ఫిబ్రవరి నెల జీతం నేటికీ అందలేదన్నారు. దీనిపై ప్రిన్సిపాల్ వారిని సంప్రదించగా తాను బిల్లు పై సంతకం పెట్టడం జరిగిందన్నారు.

## 73 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరగడంతో ఈ నెల 4న 73 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 17 మండలాల్లో వడగాడ్పులు, 5న 32 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 21 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఎండ తీవ్రత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టరు ప్రఖర్ జైన్ సూచించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం నాడు శ్రీకాకుళం జిల్లాలో 16, విజయనగరం 24, పార్వతీపురం మన్యం 15, అల్లూరి 3, పోలవరం 9, అనకాపల్లి 2, కాకినాడ 3, తూర్పుగోదావరి 1 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని వెల్లడించారు. అలాగే శ్రీకాకుళం 2, పోలవరం 2, అనకాపల్లి 1, కాకినాడ 2, తూర్పుగోదావరి 3, ఏలూరు 4, ఎన్టీఆర్ 1, పల్నాడు 2 మండలాల్లో వడగాడ్పులు ప్రభావం చూపనున్నట్లు తెలిపారు. వడగాడ్పులు వీస్తున్నందున మహిళలు, పిల్లలు, వృద్ధులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## సిబ్బంది కొరత నివారణకు చర్యలు



**కాకినాడ, పతాకం న్యూస్:** ఏలేరు రిజర్వాయర్ కార్యాలయ సిబ్బంది కొరతను అధిగమించేందుకు ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ చెప్పారు. కలెక్టర్ ఏలేరు రిజర్వాయర్, మణిహంస పవర్ ప్లాంట్లను సందర్శించారు. రిజర్వాయర్ కెపాసిటీ, రైతులకు, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నీటి విడుదల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిర్వహణకు సిబ్బంది కొరత ఉందని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సిబ్బందిని నియామకానికి కృషి చేస్తానన్నారు. రిజర్వాయర్ గేట్లు విషయమై ఇస్కో అధికారులతో చర్చించి సంబంధిత కాంట్రాక్టర్లకు నోటీసు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏలేరు ఇఇ వెంకటేశ్వర్లు, డిఇ శ్యామ్‌ప్రసాద్, సిబ్బంది మణిహంస పవర్ ప్లాంట్ మేనేజర్ వి.ప్రసాద్ బాబు, తహశీల్దారు కుశరాజు, ఎస్ఐ ఎన్.రామలింగేశ్వరరావు, రిజర్వాయర్ సిబ్బంది ఉన్నారు.

## మండుతున్న ఎండలు



**ఏలూరు, పతాకం న్యూస్:** జిల్లాలో రోజురోజుకు వేడిగాలుల తీవ్రత పెరుగుతోంది. జిల్లాలోని శనివారం బుట్టాయిగూడెం, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పాటు వడగాడ్పుల తీవ్రత పెరిగింది. బుట్టాయి గూడెంలో 40.2 , కుక్కునూరులో 41.6, పోలవరంలో 40.3, వేలేరు పాడులో 41.6 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ మండలాల్లో ప్రజలు అప్రమత్తంగా వుండాలని , ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో నీడున్న ప్రదేశాల్లోనే ఉండాలని, అవసరమైతే తప్ప బహి రంగ ప్రదేశాల్లో ప్రయాణించడం శ్రేయస్కరం కాదని చెబుతున్నారు. మరోవైపుజిల్లాలో విభిన్న వాతావరణం కొనసాగుతోంది. జిల్లాలో పగటి పూట వడగాడ్పులతో ఉక్కిరిబిక్కిరవుతుండగా సాయంత్రం పలు ప్రాంతా ల్లో వీస్తున్న ఈదురుగాలుల కారణంగా వాతావరణం చల్లబడుతోంది. ప్రస్తుతం పగటి పూట 39 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదు అవుతోంది. మధ్యాహ్నం 12 గంటల నాటికి ఉష్ణోగ్రతలు తారస్థాయికి చేరడం, దీనికి తోడు వడగాడ్పుల తీవ్రత పెరగడం కనిపిస్తోంది. గాలిలో తేమ శాతం పెరగడంతో ఉక్కబోత విపరీతంగా పెరుగుతోంది. ఎండల తీవ్రతను తట్టుకోలేక ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో నాలుగు రోజులుగా విద్యుత్ వినియోగం పెరిగింద్ణి

## బ్రిడ్జి కోర్స్ అమలు విధానం పరిశీలన

**మచిలీపట్నం, పతాకం న్యూస్:** విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు మరింత పెంపొందించే ఆధునిక బోధనా విధానాలు అవలంబించాలని కఅష్ణాజిల్లా విద్యా శాఖాధికారి యు వి సుబ్బారావు అధికారులకు సూచించారు.శనివారం మచిలీపట్నం మండలం కరగ్రహారం లోని కాంబిల్ పేట జెడ్పీ హెచ్ ఎస్ పాఠశాల పరిధిలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు మండల విద్యాశాఖ అధికారులు ఎం వి ఎస్ డి ప్రసాద్, వై ఎస్ ఆర్ కె గురుప్రసాద్, ఉపాధ్యాయులతో కలిసి ఆయన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ముచ్చటించారు.ఈ సందర్భంగా విద్యార్థుల చదువుపై ఆసక్తి, అభ్యాస స్థాయి, 10 వ తరగతి పాఠ్యాంశాలపై అవగాహన వంటి అంశాలపై చర్చిస్తూ, వారికి ప్రోత్సాహాన్ని అందించారు. బ్రిడ్జ్ కోర్స్ అమలు విధానాన్ని సమగ్రంగా పరిశీలించి, విద్యార్థుల నేర్చుకునే లోటుపాట్లను పూరించేందుకు చేపడుతున్న చర్యలను పరిశీలించారు. అలాగే పాఠశాలలో అమలవుతున్న ప్రోగ్రామ్‌పై వాలంటీర్‌తో ప్రత్యేకంగా మాట్లాడి, కార్యక్రమం అమలు తీరు, విద్యార్థుల పురోగతి, బోధన పద్ధతులపై సమీక్ష నిర్వహించారు.

# మధ్యాహ్న భోజనం ప్రైవేటీకరణ!

## 4 వేల మంది ఎండిఎం కార్మికుల ఉపాధికి ఎసరు



**పార్వతీపురం, పతాకం న్యూస్:** బడి పిల్లలకు నాణ్యతతో కూడిన పౌష్టికాహార భోజనం అందిస్తామన్న పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు చర్యలు ప్రారంభించింది. కార్మికులతో పాఠశాలల్లో వంటలు చేసే విధానానికి స్వస్తి పలికి స్మార్ట్ జిల్లాలోని పలుచోట్ల స్మార్ట్ కిచెన్‌లు ఏర్పాటు చేసి వాటి ద్వారా పాఠశాలలకు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇదే జరిగితే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందకపోవడంతో పాటు జిల్లాలో పనిచేస్తున్న సుమారు 4వేల మంది మధ్యాహ్న భోజన కార్మికుల ఉపాధి దూరం కానుంది. జిల్లాలో 1453 పాఠశాలల్లో సుమారుగా లక్షన్నర మంది విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకాన్ని వినియోగించుకుంటున్నారు. వీరికి వేడివేడిగా భోజనం సకాలంలో అందించేందుకు పాఠశాలల్లో సుమారు 4వేల మంది మహిళా కార్మికులు వంటలు చేస్తున్నారు. అయితే మహిళా కార్మికులతో కాకుండా ప్రైవేటు వ్యక్తులతో అందించేందుకు ప్రభుత్వం స్మార్ట్ కిచెన్ విధానాన్ని ముందుకు తీసుకొచ్చింది. గతంలో ధార్మిక సంస్థలకు మధ్యాహ్న భోజనం అందించేందుకు ప్రయత్నం చేయగా అప్పుడు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, పలు ప్రజాసంఘాలు, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం, ఉపాధ్యాయులు మద్దతుతో పోరాడి వెనక్కి తిప్పికొట్టారు. అయితే మళ్లీ నేడు ప్రభుత్వం స్మార్ట్ కిచెన్ పేరుతో మధ్యాహ్న భోజన పథకం ప్రైవేటీకరణ చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. అందులో భాగంగా ప్రతి జిల్లా నుంచి స్మార్ట్ కిచెన్‌లు ఏర్పాటు కోసం ప్రతిపాదనలు కోరింది. గత ఏడాది డివిజన్‌కు ఒక స్మార్ట్ కిచెన్ అనే ప్రతిపాదనను పక్కన పెట్టి నేడు ప్రతి మండలానికి రెండు స్మార్ట్ కిచెన్‌లు ఏర్పాటుకు ప్రతిపాదనలు కోరింది. దీంతో జిల్లాలో ఉన్న 15మండలాలకు 15 స్మార్ట్ కిచెన్‌లు ఏర్పాటుకు జిల్లా విద్యా శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం అర గంట సమయంలోనే భోజనాన్ని విద్యార్థులకు సరఫరా చేసే విధంగా స్మార్ట్ కిచెన్‌లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. దీని ప్రకారం జిల్లాలో వేపాడ, లక్కవరపుకోట మండలాల్లో ఒక్కొక్కటి తప్ప మిగిలిన అన్ని మండలాలకు రెండేసి స్మార్ట్ కిచెన్ లు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి అధికారులు పంపించారు. వేడి వేడి అన్నానికి దూరం కానున్న విద్యార్థులుప్రభుత్వ పాఠశాలల్లో అమలు జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకం ద్వారా ఇప్పటివరకు వేడి వేడిగా తయారైన భోజనాన్ని విద్యార్థులు తినేవారు. స్మార్ట్ కిచెన్‌ల ద్వారా వేడి వేడి అన్నం, కూరలు అందే అవకాశం లేదు. ఉదయం మండల కేంద్రంలో ఎక్కడా తయారు చేసిన భోజనం మధ్యాహ్నం 12 గంటల సమయంలో వాహనాలు ద్వారా తీసుకెళ్లి విద్యార్థులకు అందిస్తామని అధికారులు చెబుతున్నారు. ఆచరణలో ఒకే సమయానికి అన్ని పాఠశాలలకు భోజనం తరలించే అవకాశం ఉండదు. ఉదయం నుంచి వంట చేస్తే తప్ప 2500 మంది విద్యార్దులకు అందించలేని పరిస్తితి ఏర్పడుతుంది. దీంతో వేడి వంటకాలకు విద్యార్థులకు దూరమయ్యే పరిస్థితి ఉంటుంది.

ఈ నేపథ్యంలో మధ్యాహ్నం భోజనం నిర్వాహకులు అందించే వేడివేడి భోజనాన్ని పిల్లలకుదూరం చెయ్యొద్దని కార్మికులు కోరుతున్నారు.4 వేల మంది ఉపాధికి మంగళం స్మార్ట్ కిచెన్లు రావడం వలన జిల్లాలో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తున్న 4వేల మంది మహిళలు ఉపాధికి మంగళం పాడే అవకాశం ఉంది. స్మార్ట్ కిచెన్ పేరుతో వచ్చే ఏడాది నుంచి పాఠశాలల్లో భోజనాలు అందించే అవకాశం వర్కర్లకు లేకుండా ప్రైవేటు వెహికల్స్ ద్వారా పంపించనున్నారు, దీనివల్ల జిల్లాలో ఉన్న నాలుగువేల మంది కార్మికులు ఉపాధి పోతుంది. గత 25 సంవత్సరాల నుండి బిల్లులు రాకపోయినా, జీతాలు రాకపోయినా, అప్పులు చేసి పుస్తెలతాలు తాకట్టు పెట్టి పిల్లలకి వేడివేడి భోజనం పెట్టారు. అంతటి త్యాగాలు చేసిన భోజన కార్మికులపై స్మార్ట్ కిచెన్‌ల పేరిట వేటు వేసే చర్యలు పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

# రూ.10 విలువ చేసే బాదంమిల్క్ తాగి 80 మందికి అస్వస్థత?

**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** శ్రీకాకుళం నగరంలో ఇటీవలే డయేరియా ప్రబలి ఎంతోమంది ఆసుపత్రిపాలయ్యారు. ఒకరు చనిపోయారు కూడా. ఈ వ్యవహారంలో ఒక అధికారిపై వేటు కూడా పడింది. సీఎం చంద్రబాబు కూడా దీనిపై సీరియస్ అయ్యారు. ఈ ఘటన మరువకముందే శ్రీకాకుళం మండలంలోని సింగుపురం గ్రామంలో బాదంమిల్క్ తాగి 80 మంది దాకా అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగుపురంలో రెండు రోజుల క్రితం గ్రామదేవత జాతర వైభవంగా జరిగింది. మామిడివలస ప్రజలు కూడా జాతరకు వచ్చారు. కొందరు వ్యాపారులు బండ్లపై బాదం పాలు విక్రయించారు. మొదట గ్లాసు రూ.30కి అమ్మిన వారు.. ఆతర్వాత ధరను రూ. 10కి తగ్గించేశారు. తక్కువ ధరకు వస్తుండటంతో చాలామంది తాగారు. వీరందరికీ ఆరోగ్య పరిస్థితి విషమించింది. తీవ్ర జ్వరం, ఆపై వాంతులు, విరోచనాలు మొదలయ్యాయి. అస్వస్థతకు గురైన వారు హుటాహుటిన సింగుపురంలోని నాలుగు ఆర్ఎంపీ క్లినిక్‌లకు వెళ్లారు. కొన్ని గంటల వ్యవధిలోనే ఒక్కో క్లినిక్‌కు 20 మందికి పైగా క్యూ కట్టారు. ఫ్లూయిడ్స్ ఎక్కించుకుని, అక్కడ ఉండలేక ఇళ్లకు వెళ్లి చికిత్స తీసుకున్నారు. మామిడివలసలోనూ ఇవే లక్షణాలతో 15 మంది ప్రైవేటు క్లినిక్‌లకు వెళ్లారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెంటనే స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ క్లినిక్‌లను మూసివేయించి, బాధితులను సింగుపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. శుక్రవారం ఉదయం ఆరుగురు, రాత్రి మరో పదిమంది పీహెచసీలో చికిత్స పొందారు. మామిడివలసలో నలుగురికి డీహైడ్రేషన్ అయి పరిస్థితి



విషమించడంతో వారిని శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సింగుపురం పీహెచ్‌సీకి వెళ్లారు. అదనపు వైద్యులు, సిబ్బందిని రప్పించారు. కలెక్టర్ రోగులను పరామర్శించారు.

## మోడీపై రాహుల్‌గాంధీ విమర్శలు



**కేరళ, పతాకం న్యూస్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియంత్రణలో ఉన్నారని, అత్యంత అవమైనకరమైన విషయం ఏమిటంటే ట్రంప్‌ను 'సర్' అని ఆయన పిలుస్తారని చెప్పారు. మోదీ ఇంకా బ్రిటిష్ కాలంలో ఉన్నానని అనుకుంటున్నారని విమర్శించారు. మోదీని ట్రంప్ నియంత్రిస్తున్నట్టే పినరయి విజయన్‌ను మోదీ నియంత్రిస్తున్నారని అన్నారు. కేరళంలోని ఇడుక్కిలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచారసభలో రాహుల్ మాట్లాడుతూ, బీజేపీతో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (రాణఖీ) కుమ్మక్కయిందని ఆరోపించారు. 'బీజేపీ, ఆర్ఎస్ఎస్, లెఫ్ట్ ఫ్రంట్ మధ్య సంబంధాలను ఇవాళ ప్రతి ఒక్కరూ చూడొచ్చు. లెఫ్ట్ ఫ్రంట్‌లో సిద్ధాంతాల కోసం ఎళ్లతరబడి పనిచేసిన అవకాశవాదులు కాని కొందరు ఇప్పుడు తమను పార్టీ వంచించిందని ఆవేదన చెందుతున్నారు' అని రాహుల్ తెలిపారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్‌తో కుమ్మక్కయినందునే ఎల్‌డీఎఫ్ తన వామపక్ష భావజాలాన్ని కోల్పోయిందన్నారు. కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ ఎప్పుడూ సైద్ధాంతిక ప్రత్యర్థిగా ఎల్‌డీఎఫ్‌తో పోరాడేదని, ఇప్పుడు ఎల్డీఎఫ్ మారిపోయిందని, ఎల్‌డీఎఫ్‌లో 'లెఫ్ట్' అనేదే లేదని, ఎన్నికల తర్వాత అందులో ఏదీ మిగలదని అన్నారు. కేరళలోని ప్రభుత్వాన్ని ఒక చీకటి శక్తి ప్రభావితం చేస్తోందని, అది రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ ప్రజలపై దాడి చేస్తోందని పరోక్షంగా బీజేపీ-ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ విమర్శలు గుప్పించారు. ప్రధానమంత్రి మోదీ ఏ రాష్ట్రానికి వెళ్లిగా మతం, ఆలయాలు గురించి మాట్లాడతారని, కేరళ అంశాల విషయానికి వచ్చేసరికి మాత్రం పెదవి విప్పరని శబరిమల బంగారం కేసును ప్రస్తావిస్తూ అన్నారు. ఎల్‌డీఎఫ్‌కు హెల్ప్ చేయాలని ఆయన అనుకోవడమే అందుకు కారణమని వివరించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో పోరాడుతున్నందున తనపై చాలా కేసులు పెట్టారని, ఇంటరాగేట్ చేశారని, అయినా కూడా తాను వెనుదీయలేదని చెప్పారు. మోదీ ప్రతిరోజూ తనపై విమర్శల దాడి చేస్తారని, కానీ కేరళ సీఎం గురించి కానీ, ఆయన కుటుంబం గురించి కానీ ఒక్క మాట మాట్లాడరని అన్నారు. జాతీయ అంశాలపై మోదీని ఎల్డీఎఫ్ ఎప్పుడూ సవాలు చేయకపోవడమే ఇందుకు కారణమని అన్నారు.

### ప్రారంభమైన మున్సిపాలిటీలో

## వార్డుల పునర్విభజన ప్రక్రియ



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** మునిసిపాలిటీలో వార్డుల పునర్విభజన ప్రక్రియ మొదలైంది. ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం జనాభా, భౌగోళిక విస్తీర్ణం పరిగణనలోకి తీసుకొని పునర్విభజన చేయాల్సి ఉంది. ప్రస్తుతం పురపాలక సంఘం పరిధిలో 28 వార్డులు ఉన్నాయి. 2011 జనాభా లెక్కలు ప్రకారం నర్సీపట్నం మునిసిపాలిటీ జనాభా 61,540. వార్డుల పునర్విభజకు ప్రభుత్వం విడుదల చేసిన జీవో 64లో మునిసిపాలిటీ జనాభా 60 వేల నుంచి 80 వేల మధ్యలో ఉంటే 40 వార్డులు వుండాలి. దీంతో నర్సీపట్నం జనాభా 60 వేలు దాటి వున్నందున వార్డుల సంఖ్య 28 నుంచి 40కి పెరుగుతుంది. ఈ మేరకు వార్డుల పునర్విభజనపై సర్వే చేసి ముసాయిదాని సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. శుక్రవారం కమిషనర్ సురేంద్ర, పట్టణ ప్రణాళిక అధికారి సత్యనారాయణ కలిసి సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను పరిశీలించారు. వార్డుల పునర్విభజనను పూర్తి చేసిన తరువాత ముసాయిదా తయారు చేసి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేస్తారు. మునిసిపల్ అధికారులు ఈ నెల 9వ తేదీలోగా వార్డుల ముసాయిదా (డ్రాఫ్ట్) తయారు చేయాలి. అదే రోజున ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేయాలి. 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరిస్తారు. 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు, సూచనలను పరిశీలిస్తారు. అనంతరం వార్డుల విభజన ప్రతిపాదనను జిల్లా కలెక్టర్‌కు పంపుతారు. కలెక్టర్ పరిశీలించి మునిసిపల్ పరిపాలన శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ (సీడీఎంఏ)కి నివేదిస్తారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, కలెక్టర్ నివేదికను పరిగణనలోకి తీసుకొని సీడీఎంఏ నివేదికను ప్రభుత్వానికి పంపుతుంది. ప్రభుత్వం ఆమోదముద్ర వేసి మే మొదటి వారంలో తుది నోటిఫికేషన్ జారీ అవుతుంది. మునిసిపాలిటీలో వార్డుల సంఖ్య ఒకేసారి 28 నుంచి 40కి పెరగనుండడంతో మునిసిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్న పలువురు ఆశావాహుల్లో ఆనందం వ్యక్తం అవుతున్నది. గత ఎన్నికల్లో వివిధ రకాల రిజర్వేషన్ల వల్ల కౌన్సిలర్‌గా పోటీ చేయడానికి అవకాశం లభించని వారు.. ఈసారి పోటీకి ఛాన్స్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఆక్రమణల తొలగింపు



**కర్నూలు, పతాకం న్యూస్:** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎదుట రోడ్డును ఆక్రమించుకున్న షాపులను ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో తొలగించారు. కర్నూలు సర్వజన వైద్యశా లకు ఏడు జిల్లాల నుంచి రోగులు వస్తుం టారు. ముఖ్యంగా ఇన్‌గేట్ దగ్గర ఇరువైపు ల రోడ్డును ఆక్రమించుకుని కొందరు షాపులను ఏర్పాటు చేసుకోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. వాస్తవానికి ఆసుపత్రి ఎదుట ఉన్న ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని కొందరు షాపులను ఏర్పాటు చేసుకున్నారు. కానీ రోగుల రద్దీ దృష్ట్యా ఫుట్‌పాత్‌ల వద్ద ఉన్న షాపుల ఎదుట రోడ్డును ఆక్రమించుకున్నారు. దీంతో ఆసుపత్రి ఇన్‌గేట్, రివాల్వింగ్ గేటు వద్ద అక్రమంగా ఉన్న షాపుల వల్ల ఆటోలు, అక్కడే నిలిచి ఉండటంతో రోగులతో పాటు ప్రయాణికులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఇన్‌గేటు ఎదుట పండ్లు వ్యాపారులు రోడ్డును ఆక్రమించుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో ట్రాఫిక్ సీఐ, నగర పాలక మున్సిపల్ సిబ్బంది పోలీసుల సహకారంతో ఆక్రమిత దుకాణాలను తొలగించి ఆ వ్యర్థాలు, సామగ్రిని ట్రాక్టర్లలో తరలించారు. ఇన్‌గేటు వద్ద ఉన్న రెండు గేట్లలో ఒకదాన్ని మూసివేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని, రెండో గేటు కూడా తెరవాలని రోగులు కోరుతున్నారు.

## అధునాతన రక్త స్క్రీనింగ్ వ్యవస్థ ప్రారంభం

**మంగళగిరి, పతాకం న్యూస్:** రక్త మార్పిడి భద్రతను మెరుగుపరచేందుకు ఎయిమ్స్ మంగళగిరి న్యూక్లిక్ యాసిడ్ యాంప్లిఫికేషన్ టెస్టింగ్ మరియు ఆటోమేటెడ్ స్క్రీనింగ్ వ్యవస్థలను ప్రారంభించింది. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డా. అహంతేమ్ శాంతా సింగ్ ఈ సదుపాయాలను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ డా. రాజశేఖర్ మోహన్, డిప్యూటీ డైరెక్టర్ కల్నల్ శశికాంత్ తుమ్మ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ విభాగాధిపతి డా. ఐ.ఎస్. చైతన్య కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. అనిలా మణి పాల్గొన్నారు.రూ.1.73 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన హెచ్ఐవి, హెపటైటిస్ బి, సి వంటి ఇన్ఫెక్షన్లను ముందుగానే గుర్తించవచ్చు. ఆటోమేటెడ్ స్క్రీనింగ్ వల్ల పరీక్ష ఫలితాలు 5--8 గంటల బదులు కేవలం 30 నిమిషాల్లో లభిస్తున్నాయి.

## అమరావతిలో దోపిడీని అరికట్టాలి



**కర్నూలు, పతాకం న్యూస్:** అమరావతిలో రాజదానికి తాము ఎన్నడు వ్యతిరేకం కాదని, అయితే అక్కడ సీఆర్‌డీఏ పేరుతో చేస్తున్న దోపిడీని అరికట్టాలని కర్నూలు వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహనరెడ్డి విమర్శించారు. నగరంలోని ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్వీ మాట్లాడుతూ.. మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు ప్రాంతాలను కలుపుతూ మావిగన పేరుతో రాజధాని ఏర్పాటు చేయాలని జగన కోరారన్నారు. పేరు ఏదైనా మూడు ప్రాంతాలలో మూడు హైవేలు కలుస్తాయని ఎస్వీ అన్నారు. అమరావతిలో అడుగుకు రూ.12 వేల రూపాయలు ఖర్చుపెడితే తరువాత సామాన్యులు అడుగుకు రూ.12 వేలు పెట్టి ఎవరైనా ఇళ్లు కట్టుకోగలరా? అని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయమనోహరి, సీనియర్ నాయకులు నరసింహులు యాదవ్, ఫిరోజ్ పాల్గొన్నారు.

## నిలిచిపోయిన సాగర్ జలాలు



**ప్రకాశం, పతాకం న్యూస్:** ముండ్లమూరు మండలంలోని రజానగరం మేజర్‌కు సాగర్ జలాలు సింగనపాలెం మైనర్ వద్ద పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ఆయకట్టులో వరి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. రబీ సీజన్‌లో 1010, సన్నాలు రకం వరి సాగు చేశారు. ప్రస్తుతం పైరు కంకి, మరికొంత పొట్ట దశలో ఉంది. గింజ గట్టిపడాలంటే నీరు పుష్కలంగా అవసరం. రెండు రోజుల నుంచి సాగర్ జలాలు పూర్తిగా రాకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికే ఎకరాకు 30 నుంచి 40వేల వరకు పెట్టుబడి పెట్టామని వాపోతున్నారు. 15వ తేదీ వరకు నీరు సరఫరా చేయాలని కోరుతున్నారు.

# సైనసైటిస్‌తో బాధపడుతున్నారా?

ప్రస్తుతం చాలా మందిని వేధిస్తున్న ఆరోగ్య సమస్యల్లో సైనసైటిస్ ఒకటి. సాధారణంగా వాతావరణంలో మార్పులతో పాటు చలి పెరిగినా సైనస్ గదుల్లో ఇన్?ఫెక్షన్ సోకి ఇబ్బంది అవుతుందని.. రెండు ముక్కులు బిగుసుకొని పోయి, తరచుగా జలుబు చేస్తుందంటున్నారు నిపుణులు. అలాగే, తలంతా బరువుగా, ముఖ మంతా ఉబ్బరంగా ఉంటుందని చెబుతున్నారు. కనుబొమ్మలు జివ్వుమని లాగుతుం టాయని తెలియ జేస్తున్నారు. కొంతమందికి సైనసైటిస్? దీర్ఘ కాలంగా ఉంటుందని వివరిస్తున్నారు. ఈ క్రమంలో సైనసైటిస్‌కి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఇప్పుడు తెలుసుకుందాం! ముక్కుతో గాలిని పీల్చుకుంటాం, వాటినే సైనస్ అంటాం. ఇవి ముఖంలోని కళ్లు దగ్గర, ముక్కు పక్కన ఎముకలలో ఉండే గాలితో నిండిన ఖాళీ ప్రదేశాలు. వీటిలో ఇన్ఫెక్షన్ వచ్చి వాపు ఏర్పడటాన్ని 'సైనసైటిస్' అంటారు. ఈ ఇన్ఫెక్షన్ వల్ల ముక్కు కారడం, ముక్కు దిబ్బడ, తలనొప్పి, ముఖంలో నొప్పి, దగ్గు, అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయంటున్నారు నిపుణులు. ఏళ్ల తరబడి వేధించే సైనస్ బాధలను క్రానిక్ సైనసైటిస్‌గా పేర్కొంటాం. బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్, వాతావరణంలో మార్పులతో ఈ సమస్య వస్తుందని నిపుణులు అంటున్నారు. సైనసైటిస్ తీవ్రంగా ఉంటే గాలి ఆడకపోవడమే కాకుండా కంటిచూపుపై ప్రభావం చూపు తుందని చెబుతున్నారు. అంతేకాకుండా, కళ్లు బైర్లు కమ్ముతాయని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో తీవ్రమైన సైనసైటిస్ ఉన్నవారిలో 70% వరకు ఎటు వంటి మందులు లేకుండానే కోలు కుంటారని అధ్యయనం పేర్కొంది. కొంతమందికి మాత్రం నాసల్ ఎండోస్కోపీ,



సిటీ స్కాన్?తో తీవ్రత తెలుస్తుందంటున్నారు నిపుణులు. ఆపై మందులు వాడితే మంచి ఫలితం ఉంటుందని వివరిస్తున్నారు. పెద్దవారిలో తీవ్రమైన సైనసైటిస్ లక్షణాలు చాలా తరచుగా జలుబు తగ్గకపోతే లేదా 7 నుంచి 10 రోజుల తర్వాత అధ్వాన్నంగా మారిన తర్వాతే కనిపిస్తాయని అధ్యయనం పేర్కొంది.

దుర్వాసన లేదా వాసన కోల్పోవడం, దగ్గు, అలసట, అనారోగ్యంగా ఉన్నారనే సాధారణ భావన, జ్వరం, తలనొప్పి, ఒత్తిడి లాంటి నొప్పి, కళ్లు వెనుక నొప్పి, పంటి నొప్పి లేదా ముఖం సున్నితత్వం, ముక్కు కారడం, స్రావం, గొంతు నొప్పి

ఒక నెల లేదా అంతకంటే తక్కువ కాలం ఉంటుంది. ఇది సైనస్‌లలో పెరిగే వైరస్‌లు లేదా బ్యాక్టీరియా వల్ల వస్తుంది.

సబాక్యూట్ సైనసైటిస్ : 1- 3 నెలల వరకు లక్షణాలు, వాపు ఉంటుంది.

దీర్ఘకాలిక సైనసిటిస్ : సైనస్‌ల లక్షణాలు, వాపు 3 నెలల కంటే ఎక్కువ కాలం ఉండటం. ఇది బ్యాక్టీరియా లేదా ఫంగస్ వల్ల సంభవించవచ్చు.

జాగ్రత్తలు, చికిత్స ఇలా : చల్లని గాలి, చల్లని పదార్థాలకు దూరంగా ఉండాలంటున్నారు నిపుణులు. అన్నం, ఫలహారాలూ ఏవైనా వేడిగా తీసుకోవాలని చెబ్నుతున్నారు. ఈ క్రమంలో సూప్, పాలు, టీ ఇలా ఏదైనా వెచ్చగా తాగుతుంటే, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు నుంచి ఉపశమనం కలుగుతుందని వివరిస్తున్నారు. అలాగే, విటమిన్ సి ఎక్కువగా ఉన్న నారింజ, నిమ్మ, ద్రాక్ష, కివి లాంటివి ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు. వీటిలో ఉంటే యాంటీ ఇన్?ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉన్నందున జలుబు నుంచి ఉపశమనం కలిగిస్తాయని పేర్కొంటున్నారు. తలస్నానం తరచుగా చేయొద్దని తెలియ జేస్తున్నారు. అంతే కా కుండా, తరచుగా ఆవిరి పట్టుకున్న ఇబ్బం దులు తగ్గిపోతాయని వెల్లడిస్తున్నారు. సైనస్? బాధల్ని పెంచే అలర్జీ కారకాలైన దుమ్ము ధూళి, కాలుష్యం ఉన్న చోట నుంచి దూరంగా ఉండాలని తెలియజేస్తున్నారు. ముఖ్యంగా, ఇంట్లోకి గాలి, వెలుతురు వచ్చేలా జాగ్రత్తలు తీసుకోవాలని సలహా ఇస్తున్నారు.

# ఇరాన్‌లో రెండు వేల మందిపైగా మృతి



**ఇరాన్ :** అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి వేలాది మంది చనిపోతున్నారు. పెద్ద సంఖ్యలో క్షతగాత్రులవుతున్నారు. ఇరాన్‌పై కొనసాగుతున్న దాడుల్లో రెండు వేల మంది పైగా చనిపోయారు. మరో 26,500 మంది పైగా గాయపడ్డారు. పెద్ద సంఖ్యలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆసుపత్రుల భవనాలు నేలమట్టంమయ్యాయి. ఇంధన క్షేత్రాలు, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు కూడా విధ్వంసానికి గురయ్యాయి. వివిధ వార్తా సంస్థలు వెల్లడించిన వివరాల ప్రకారం..ఒక్క ఇరాన్‌లోనే 2076 మంది చనిపోయారు. 26,500 మంది పైగా గాయపడ్డారు. లెబనాన్‌లో ఇజ్రాయిల్ జరిగిన దాడుల్లో 1345 మంది చనిపోగా..4040 మంది గాయపడ్డారు. సిరియాలో, పాలస్తీనాలో నలుగురేసి చొప్పున చనిపోయారు. అలాగే ఇరాన్ ప్రతిదాడులతో ఇజ్రాయిల్‌లో 24 మంది చనిపోగా..6,594 మంది గాయపడ్డారు. ఇరాక్ 109 మంది చనిపోయారు. యుఎఇలో 12 మంది మృత్యువాత పడగా..190 మంది గాయపడ్డారు. కువైట్‌లో ఏడుగురు చనిపోగా..డజన్ల సంఖ్యలో గాయపడ్డారు. ఒమన్‌లో ముగ్గురు చనిపోగా..15 మంది గాయపడ్డారు. జోర్డాన్‌లో 29 మంది క్షతగాత్రులయ్యారు. బహ్రెయిన్‌లో ముగ్గురు చనిపోగా..డజన్ల కొలదీ గాయపడ్డారు. ఖతర్‌లో 16 మంది గాయపడ్డారు. వీరితో పాటు అమెరికా సైన్యానికి చెందినవారు 13 మంది మృత్యువాత పడగా..200 మంది పైగా గాయపడ్డారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌లోని వంతెనలు, విద్యుత్ ప్లాంట్‌లపై దాడులు చేస్తామని హెచ్చరించారు. 'అమెరికా సైన్యం ఇరాన్‌లో మిగిలి ఉన్న వాటిని నాశనం చేయడం ఇంకా ప్రారంభించలేదు. తరువాత టార్గెట్ వంతెనలు, ఆపై విద్యుత్ ప్లాంట్లు' అని ట్రంప్ తన సోషల్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇరాన్ నాయకత్వానికి 'మాకు ఏం కావాలో తెలుసు, ఏమి చేయాలో కూడా తెలుసు, త్వరగా చేయాలి' అని ట్రంప్ మరోసారి బెదిరించారు. మరోవైపు ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు శుక్రవారం మాట్లాడుతూ, ఇజ్రాయిల్ దాడులు ఇరాన్ ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంలో దాదాపు 70 శాతం ధ్వంసం చేశాయని, ఇది ఆయుధాల తయారీ సామర్థ్యాన్ని గణనీయంగా అడ్డుకుందని తెలిపారు. 'మా అమెరికన్ స్నేహితులతో కలిసి, మేము ఇరాన్‌లోని ఉగ్రవాద పాలనను అణచివేయడం కొనసాగిస్తున్నాము. మేము కమాండర్లను తొలగిస్తున్నాము, వంతెనలను బాంబులతో పేల్చుతున్నాము, మౌలిక సదుపాయాలను బాంబులతో పేల్చుతున్నాము' అని నెతన్యాహు ఒక వీడియోలో తెలిపారు.

# పుట్టగొడుగుల్లా బెల్ట్‌షాపుల నిర్వహణ?

## దాబాలు, మారుమూల గ్రామాల్లోని బెల్టుషాపుల్లో జోరుగా మద్యం విక్రయాలు





**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లాలో పలుచోట్ల బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కొంతమంది ఎక్సైజ్ అధికారులు, పోలీసుల నిర్లక్ష్యంతో జాతీయ రహదారి పక్కన దాబాలు, మారుమూల గ్రామాల్లోని బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. జిల్లాలో 288 మద్యం షాపులతోపాటు గీతకార్మికులకు మరో 18 షాపులు కేటాయించారు. అలాగే 18 బార్లకు అనుమతులు ఇచ్చారు. కాగా జాతీయ రహదారికి ఆనుకుని మద్యం షాపులకు అనుమతి లేకపోయినా.. కొంతమంది యజమానులే.. తమ బంధువుల ద్వారా బెల్టుషాపులు ఏర్పాటు చేసి మద్యాన్ని అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఒక్కోసీసాపై 30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఒక్కో వైన్‌షాపు కింద 30 దాకా బెల్టుషాపులు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. కొన్నిషాపులకు పర్మిట్ రూములకు అనుమతి లేకపోయినా.. దుకాణం పక్కనే గదులు నిర్మించి అమ్మకాలు సాగిస్తున్నారు. కొన్ని దాబాల్లో కూడా మందుబాబుల కోసం ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం వైన్‌షాపులకు అనుమతి ఇచ్చిన తర్వాత కొన్నిరోజులపాటు పోలీసులు, ఎక్సైజ్ అధికారులు హడావుడి చేశారు. మద్యం విక్రయదారులు, రవాణా చేసేవారిపై కేసులు పెట్టారు. ప్రస్తుతం మద్యం దుకాణాల యజమానులు సిండికేట్‌గా మారి.. కొంతమంది అధికారులకు మామూళ్లు సమర్పిస్తుండడంతో అటువంటి చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడులు చేసిన సమయంలో బెల్టుషాపుల్లో భారీగా మద్యం దొరికినా.. నాలుగైదు సీసాలే పట్టుబడినట్టు చూపిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. మద్యం షాపు యజమానికి రూ.5 లక్షల జరిమానా పడుతుందనే ఉద్దేశంతోనే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది.

జిల్లాలో పైడిభీమవరం నుంచి ఇచ్ఛాపురం వరకు సుమారు 175 కి.మీ మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. ఈ రహదారి పక్కన సుమారు 75 దాబాలు ఉన్నాయి. అధికంగా ఒడిశా వ్యాపారులు దాబాలను నిర్వహిస్తున్నారు. ఈ దాబాల్లో రాత్రివేళ లారీడ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు మద్యం తాగుతున్నారు. ఆపై వాహనాలు నడుపుతుండడంతో.. ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కొంతమంది యువకులు దాబాల వద్దే పార్టీల పేరుతో మద్యం సేవించి తగదాలకు పాల్పడుతున్నారు. అధికారులు స్పందించి దాబాలు, బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.




# పంజాబ్ కింగ్స్ ఖాతాలో మరో గెలుపు



పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కి తోడు ప్రభ్ సిమ్రన్ సింగ్ రాణించడంతో చెన్నై సూపర్‌కింగ్స్ నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 209పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. అనంతరం పంజాబ్ కింగ్స్ 18.4ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 210పరుగులు చేసి సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించింది. పంజాబ్ జట్టు కెప్టెన్ శ్రేయస్(50; 29బంతుల్లో 4ఫోర్లు, 3సిక్సర్లు), ప్రభ్ సిమ్రన్(43; 34బంతుల్లో 6ఫోర్లు, సిక్సర్)కి తోడు ప్రియాన్ష్ ఆర్యా(39), కూపర్ కనోలే(36) కూడా రాణించి తలో చేయి వేశారు. చెన్నై బౌలర్లు హెన్రీ, కంబోజ్ రెండేసి వికెట్లతో రాణించారు. అంతకుముందు చెన్నై ఓపెనర్ సంజూ శాంసన్(7) చెపాక్‌లోనూ నిరాశపరిచాడు. ఆ తర్వాత అండర్-19 కెప్టెన్ ఆయుష్ మాత్రే(73), చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(28) కలిసి చెలరేగి ఆడారు. హ్యాట్రిక్ ఫోర్లతో.. కళాత్మక సిక్సర్లతో అలరించిన మాత్రే 29 బంతుల్లోనే అర్ధ శతకం సాధించాడు. రెండో వికెట్‌కు 55 బంతుల్లో 96 పరుగులు జోడించిన ఈ ద్వయాన్ని చాహల్ విడదీశాడు. మాత్రే ఔటయ్యాక క్రీజ్‌లోకి వచ్చిన కార్తీక్ శర్మ(1)ను యాన్సెన్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఆ తర్వాత సర్ఫరాజ్ ఖాన్(32) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. తొలి మ్యాచ్‌లో ఇంప్యాక్ట్ చూపలేకపోయిన అతడు ఈసారి టీ20 బ్యాటర్‌లా రెచ్చిపోయాడు. అర్ష్‌దీప్, విజరుకుమార్ ఓవర్లలో హ్యాట్రిక్ బౌండరీలతో అలరించారు. ప్రమాదకరంగా మారిన సర్ఫరాజ్‌ను షార్ట్ బంతితో విజరుకుమార్ బోల్తా కొట్టించాడు. శివం దూబే(45 నాటౌట్) తన స్టయిల్లో ఫోర్లు, సిక్సర్ల మోత మోగించాడు. అర్ష్‌దీప్ వేసిన చివరి ఓవర్లో దూబే మూడు ఫోర్లు కొట్టాడు. దీంతో చెన్నై జట్టు నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి 5వికెట్ల నష్టానికి 209పరుగుల భారీస్కోర్ చేసింది. విజరుకుమార్ వ్యాషక్‌కు రెండు, చాహల్, యాన్సెన్, బార్ట్‌లెట్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: సంజు శాంసన్ (సి)ప్రభ్‌సిమ్రన్ సింగ్ (బి)బార్ట్‌లెట్ 7, గైక్వాడ్ (సి)వాధేరా (బి)చాహల్ 28, మాత్రే (సి)చాహల్ 9బి)వ్యాషక్ 73, దూబే (నాటౌట్) 43, కార్తీక్ శర్మ (ఎల్‌బి)యాన్సెన్ 1, సర్ఫరాజ్ ఖాన్ (సి)వాధేరా (బి)వ్యాషక్ 32, ప్రశాంత్ వీర్ (నాటౌట్) 6, అదనం 17. (20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 209పరుగులు. వికెట్ల పతనం: 1/14, 2/110, 3/123, 4//130, 5/168 బౌలింగ్: ఆర్ష్‌దీప్ 4-0-41-0, బార్ట్‌లెట్ 4-0-48-1, యాన్సెన్ 4-0-43-1, వ్యాషక్ 4-0- 38-2,చాహల్ 3-0-21-1,స్టొయినీస్ 1-0-17-0.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాన్ష్ ఆర్యా (బి)హెన్రీ 39, ప్రభ్ సిమ్రన్ సింగ్ (రనౌట్) సర్ఫరాజ్/రుతురాజ్ గైక్వాడ్ 43, కూపర్ కనోలే (సి)హెన్రీ (బి)కంబోజ్ 36, శ్రేయస్ అయ్యర్ (సి)రాహుల్ చాహర్ (బి)కంబోజ్ 50, నేహల్ వధేరా (సి)నూర్ అహ్మద్ (బి)హెన్రీ 10, శశాంక్ సింగ్(నాటౌట్) 14, స్టొయినీస్ (నాటౌట్) 9, అదనం 9. (18.4ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 210 పరుగులు. వికెట్ల పతనం: 1/61, 2/95, 3/127, 4/186, 5/186 బౌలింగ్: ఖలీల్ అహ్మద్ 3-0-28-0, హెన్రీ 4-0-54-2, కంబోజ్ 3.4-0-43-2, నూర్ అహ్మద్ 4-0-38-0, చాహర్ 4-0-46-0.

# వైభవ్ బ్యాట్ స్పీడ్ ఎక్కువ... మైదానం నలువైపులా షాట్లు ఆడగలడు: యువీ



భారత క్రికెట్ జట్టు మాజీ ఆల్-రౌండర్, ప్రపంచకప్ హీరో యువరాజ్ సింగ్.. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై ప్రశంసల వర్షం కురిపించాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే అద్భుతమైన బ్యాటింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న వైభవ్, త్వరలోనే టీమిండియాకు ఆడటం ఖాయమని జోస్యం చెప్పాడు. ముఖ్యంగా వైభవ్ బ్యాట్ స్పీడ్ తనకంటే మెరుగ్గా ఉందని యువీ చెప్పాడు. 2025 ఐపీఎల్ వేలంలో 13 ఏళ్ల వయసులోనే రాజస్థాన్ రాయల్స్ జట్టు వైభవ్‌ను రూ.1.1 కోట్లకు కొనుగోలు చేయడంతో అతను ఒక్కసారిగా వెలుగులోకి వచ్చాడు. గతేడాది ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్, ఆడిన తొలి బంతినే సిక్సర్‌గా మలిచి తన రాకను ఘనంగా చాటాడు. ఆ తర్వాత తన రెండో ఐపీఎల్ మ్యాచ్‌లోనే కేవలం 35 బంతుల్లో సెంచరీ బాది, ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత వేగంగా శతకం సాధించిన భారత బ్యాటర్‌గా, అత్యంత పిన్న వయస్కుడైన సెంచూరియన్‌గా రికార్డులు సృష్టించాడు. ఓ క్రీడా ఛానెల్‌తో మాట్లాడుతూ యువరాజ్ సింగ్.. వైభవ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "ప్రస్తుతం టీ20 క్రికెట్‌లో వస్తున్న కొత్త ఆటగాళ్లను చూడండి. వైభవ్ సూర్యవంశీ అద్భుతంగా రాణిస్తున్నాడు. అతని బ్యాట్ స్పీడ్ నమ్మశక్యంగా లేదు. నా కంటే అతని బ్యాట్ స్పీడ్ బాగుంది. అంత స్పీడ్ ఉన్న ఆటగాళ్లను నేను చాలా అరుదుగా చూశాను" అని యువీ కొనియాడాడు. మైదానం నలువైపులా షాట్లు ఆడగల నైపుణ్యం అతని సొంతమని వివరించాడు. "చిన్న వయసులోనే అతనిలో ఎన్నో నైపుణ్యాలు ఉన్నాయి. వైఫల్యాలు, విజయాల నుంచి నేర్చుకుంటూ అతను మరిన్ని మ్యాచ్‌లు ఆడితే మరింత మెరుగైన బ్యాటర్‌గా ఎదుగుతాడు" అని యువీ అన్నాడు. ఐపీఎల్ భారత క్రికెట్ స్వరూపాన్నే మార్చేసిందని యువరాజ్ అభిప్రాయపడ్డాడు. "ఈ కుర్రాళ్లు నేరుగా ఐపీఎల్‌లో పెద్ద సంఖ్యలో ప్రేక్షకుల ముందు ఆడుతున్నారు. అదే నిర్భయమైన ఆటతీరును అంతర్జాతీయ క్రికెట్‌లోనూ కొనసాగిస్తున్నారన్నారు.




# 'బైకర్' మూవీ రివ్యూ



హీరో శర్వానంద్ నటించిన చిత్రం 'బైకర్'. తొలి భారతీయ మోటో రేసింగ్ చిత్రంగా, బైక్ రేసింగ్ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం ప్రచార చిత్రాలతో అందర్నీ ఆకట్టుకోవడంతో పాటు శర్వానంద్ లుక్ కూడా ఈచిత్రంలో వైవిధ్యంగా కనిపించడంతో సినిమాపై ఆసక్తిని పెంచింది. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులను అలరించే అంశాలున్నాయా? అసలు బైకర్ కథేమిటి? తెలుసుకుందాం. విక్కీ అలియాస్ వికాస్ నారాయణ్, (శర్వానంద్) తండ్రి సునీల్ నారాయణ్ (రాజశేఖర్) దగ్గరే మోటో రేసింగ్ బైకర్‌గా శిక్షణ పొంది అంతర్జాతీయ బైక్ రేసర్‌గా రాణించాలని ప్రయత్నిస్తుంటాడు. సునీల్ నారాయణ్ క్రికెట్‌తో సమానంగా ఇండియాలో మోటో రేసింగ్ స్పోర్ట్స్‌కు గుర్తింపు తేవాలని కలలు కంటాడు. అందుకే కొడుకు విక్కీని గొప్ప బైక్ రేసర్‌గా తీర్చిదిద్దటానికి ట్రైనింగ్ ఇస్తుంటాడు. విక్కీ, తండ్రి డ్రీమ్ నెరవేర్చేందుకు అంతర్జాతీయ రేసింగ్‌లో పాల్గొంటాడు. అయితే ఈ పోటీలో ప్రత్యర్థి అన్వర్ వేసిన పన్నాగంతో విక్కీ మూడో స్థానంలో నిలుస్తాడు. ఈ రేసింగ్ తరువాత విక్కీ కొన్ని కారణాల వల్ల రేసింగ్‌కి, తండ్రికి దూరం కావాల్సి వస్తుంది. విక్కీ జీవితంలోకి వచ్చిన అనన్య వల్ల ఆయన లైఫ్‌లో వచ్చిన మార్పులేమిటి? కొంత విరామం తరువాత మళ్లీ విక్కీ రేసింగ్‌లో ఎందుకు పాల్గొన్నాడు? ఇందుకు కారణాలేమిటి? రేసింగ్‌లో ఇండియా తరపున విక్కీ విజయం సాధించి తండ్రి ఆశయాన్ని నేరవేర్చాడా? లేదా? తండ్రి, కొడుకుల మధ్య అసలు జరిగిందేమిటి? ఇవన్నీ తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఇప్పటి వరకు ఇండియన్ సినిమాలో ఎవరికి పరిచయం లేని బైక్ రేసింగ్ నేపథ్యంలో మోటో రేసింగ్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది. ఈ నేపథ్యానికి ఫ్యామిలీ ఎమోషన్స్‌ను జోడించి దర్శకుడు ఈ కథను అల్లుకున్నాడు. అయితే ఇప్పటి వరకు తెలుగు తెరపై వచ్చిన స్పోర్ట్స్ డ్రామాల కథల తరహాలోనే ఈ కథ కూడా ఉంటుంది. కథ, కథనాల్లో ఎలాంటి కొత్తదనం ఉండదు. కథలో ఎలాంటి కీలక మలుపులు కూడా దర్శకుడు ఈ కథలో జోడించలేదు. ఊహకు అందే కథ, సన్నివేశాలతో సినిమా ఆద్యంతం తెలిసిన కథలానే కొనసాగుతుంది. దీనికి తోడు సినిమాలో ఉన్న ఫ్యామిలీ ఎమోషన్స్‌ను పూర్తిస్థాయిలో పండించడంలో దర్శకుడు తడబడ్డాడు. కథ, ఎమోషన్స్ కంటే కథ నేపథ్యానికి కీలకంగా నిలిచే రేసింగ్ సన్నివేశాలపైనే దర్శకుడు దృష్టి పెట్టాడు. ఈ విషయంలో మాత్రం ఆయన సఫలీకృతుడయ్యాడు. ఎందుకంటే సినిమాకు మోటో రేసింగ్ నేపథ్యం కొత్తదనంతో పాటు సినిమా చూస్తే ఆడియన్స్‌ను థ్రిల్లింగ్‌ను కలిగిస్తుంది. రేసింగ్ సన్నివేశాలను విజువల్‌గా హైస్టాండర్డ్‌లో కనిపించాయి. ఈ సన్నివేశాల్లో ప్రేక్షకులు కూడా లీనమయ్యే విధంగా దర్శకుడు తెరపైకి తీసుకొచ్చాడు. ముఖ్యంగా అత్యంత క్లిష్టమైన రేసింగ్ సన్నివేశాలను ఎంతో ఉన్నత స్థాయిలో చిత్రీకరించారు. ఇక్కడే డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ తన ప్రతిభను చూపారు. ఫస్టాఫ్ కాస్త స్లోగా స్పీడ్ తగ్గినట్లుగా అనిపించినా.. సెకండాఫ్‌ను దర్శకుడు తెరకెక్కించిన విధానం ప్రశంసనీయం. ముఖ్యంగా ఈ సినిమాకు సెకండాఫే కీలకం. ఇక్కడ ఏ మాత్రం దర్శకుడు సన్నివేశాల రూపకల్పనలో నిర్లక్ష్యంగా ఉన్నా సినిమా ఆద్యంతం డాక్యుమెంటరీ ఫీల్‌ను కలిగించేది. అయితే తొలిసగంతో కంపేర్ చేస్తే మలిసగంలో సినిమా స్పీడ్‌ను, కొన్ని బలమైన ఎమోషన్ సన్నివేశాలను జనరంజకంగా తీర్చిదిద్దడం, పతాక సన్నివేశాలను కన్వీన్సింగ్‌గా ప్రజెంట్ చేయడంతో ఓవరాల్‌గా ఓ రిఫ్రెషింగ్ స్టోరీతో సినిమా చూశామన్న అనుభూతి ప్రేక్షకులకు కలుగుతుంది. అయితే దర్శకుడు ఒక్కోసారి సినిమా కథకు బ్రేక్ వేసి, బైక్‌ను మాత్రం రేసింగ్ ట్రాక్‌పై తిప్పుతున్నాడా? అనే ఫీల్ కలిగే విధంగా కథ ముందుకు కదలదు. మలేషియా రేస్ ట్రాక్‌పై జరిగే బైక్ రేసింగ్, జర్మనీలో సాగే రేసింగ్ సీన్స్ ఈ లోపాలను అధిగమించేలా చేశాయి. అయితే కథలో ఎమోషన్ సన్నివేశాలపై శ్రద్ద పెట్టి, వాటిని హార్ట్‌టచ్చింగ్‌గా తెరకెక్కించి ఉంటే ఈ బైకర్ రైడ్ హ్యాపీ జర్నీలా ఉండేది. ఓవరాల్‌గా రేసింగ్ అనే కొత్త నేపథ్యంతో దర్శకుడు నిజాయితీగా చేసిన ఈ ప్రయత్నం అభినందనీయం. ఈ సినిమాలో హీరో శర్వానంద్ లుక్, గెటప్ ఎంతో ఆకర్షణీయంగా ఉంది. ఆయన నటన ఈ చిత్రానికి ప్రధాన బలం. క్యారెక్టర్ తగిన విధంగా స్పోర్ట్స్ పర్సన్‌గా ఆయన బాడీని మార్చుకున్న విధానం సినిమా పట్ల శర్వానంద్‌కు ఉన్న తపనను తెలియజేస్తుంది. యాక్షన్‌తో పాటు ఎమోషనల్ సన్నివేశాల్లో శర్వానంద్ నటన ఆర్గానిక్‌గా అనిపించింది. సునీల్ నారాయణ పాత్రలో రాజశేఖర్ ఆకట్టుకున్నారు. కోచ్ పాత్రలో రాజశేఖర్ కొత్తగా ఉన్నారు. మాళవిక పాత్ర సినిమాలో కీలకంగా ఉంటుంది. అతుల్ కులకర్ణి, బ్రహ్మాజీ, తులసి తదితరుల క్యారెక్టర్స్ అలరిస్తాయి. టెక్నికల్‌గా కూడా ఈ చిత్రం హై స్టాండర్స్‌లో ఉంది. ముఖ్యంగా యువరాజ్ ఫోటోగ్రఫీతో సినిమా ఎంతో కలర్‌ఫుల్‌గా కనిపించింది. రేసింగ్ సన్నివేశాల్లో ఆయన ప్రతిభ గురించి సినిమా చూసిన అందరూ మాట్లాడుకునే విధంగా ఉంటాయి.

# టోక్యోలోని క్రంచీరోల్ యానిమే అవార్డు వేడుకలో ప్రజెంటర్‌గా రష్మిక మందన్న



ప్రముఖ సినీ నటి రష్మిక మందన్న టోక్యోలో జరగనున్న క్రంచీరోల్ యానిమే అవార్డు-2026 ప్రదానోత్సవంలో పాల్గొనున్నారు. జపనీస్ యానిమేషన్‌కు సంబంధించిన పేరుగాంచిన ఈ వార్షిక వేడుకకు ఆమె ప్రజెంటర్‌గా ఖరారయ్యారు. రష్మిక ప్రజెంటర్‌గా హాజరు కావడం ఇది రెండోసారి. మొదటిసారి 2024లో హాజరయ్యారు. భారత్ నుంచి ఈ అవార్డుల వేడుకకు వెళ్లిన మొదటి సినిమా సెలబ్రిటీగా నిలిచారు. క్రంచీరోల్ యానిమే అవార్డ్స్ 10వ ఎడిషన్ మే 23న టోక్యోలోని గ్రాండ్ ప్రిన్స్ హోటల్ షిన్ టకనావాలో జరగనుంది. ఈ వేడుక కోసం వివిధ దేశాలకు చెందిన తారలతో కూడిన ప్రజెంటర్ల జాబితాను రూపొందించారు. జపనీస్ నటి అసుకా సైటో, మెక్సికన్ గాయని మరియు నటి డానా, ప్రఖ్యాత కాస్?ప్లేయర్ ఎనాకో, ఆస్ట్రేలియన్ గాయని మరియు గేయరచయిత్రి హన్నా బాంగ్, నటి కసుమి అరిమురా, నటి నానాసే ని షి నో , హాలీవుడ్ నటుడు విన్‌స్టన్ డ్యూక్‌లతో కూడిన మొదటి విడత ప్రజెంటర్ల జాబితా బృందంలో రష్మిక మందన్న కూడా చేరారు. జపాన్ యానిమేటెడ్ చిత్రాలు, వెబ్ సిరీస్‌లు, వాటిలో సత్తా చాటిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు క్రంచీరోల్ యానిమే అవార్డులు ఇస్తారు. ప్రజెంటర్లుగా వీరంతా వేదికపై విజేతల వివరాలను ప్రకటించి, వారికి అవార్డులను అందజేస్తారు.




# ఆది సాయికుమార్ కొత్త చిత్రం 'సైరాభాను'



యంగ్ హీరో ఆది సాయికుమార్ తన కొత్త సినిమాను అధికారికంగా ప్రారంభించారు. ఫణి కృష్ణ సిరికి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి "సైరాబాను' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. శుక్రవారం ఈ సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా మొదలైంది. ఇటీవలే 'కె-ర్యాంప్' చిత్రంతో సంచలన విజయం అందుకున్న ప్రముఖ నిర్మాత రాజేష్ దండా తన హాస్య మూవీస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో ఆది సాయికుమార్ సరసన బాంధవి శ్రీధర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది. గులాబీ రంగు మేఘం, దాని కింద 'ప్రేమ, విశ్వాసం, విధికి సంబంధించిన ఒక సరదా ప్రయాణం' అనే ట్యాగ్‌లైన్‌తో రొమాంటిక్ ఫీల్‌ను కలిగిస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, ఇది ఒక హిందూ-ముస్లిం ప్రేమకథ అని, వినోదభరితంగా సాగుతుందని తెలుస్తోంది. రాజమండ్రి, హైదరాబాద్ నగరాల నేపథ్యంలో కథ నడుస్తుంది. పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కిరణ్ అబ్బవరం, రామ్ అబ్బరాజు, కోన వెంకట్ తదితరులు హాజరై చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. 'శంబాల'తో కెరీర్‌లో మంచి హిట్ అందుకున్న ఆది సాయికుమార్, ప్రస్తుతం కథాబలం ఉన్న కమర్షియల్ చిత్రాలను ఎంచుకుంటున్నారు. ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందిస్తుండగా, రామ్ రెడ్డి సినిమాటోగ్రఫీ, చోటా కె ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**